www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 296 | పేజీలు : 10 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | శనివారం 06-07-2024

MHR TV
www. mhrtv.com

# భేటీకి వేళాయే...

## నేడు హైదరాబాద్‌లో ప్రజాభవన్ వేదికగా ఏపీ సీఎం చంద్రబాబు, టీజీ సీఎం రేవంత్ రెడ్డి సమావేశం



**హైదరాబాద్ జూలై 5 (ప్రజాస్వరం):** చంద్రబాబుతో రేవంత్ రెడ్డి భేటీ అంశం రెండు తెలుగు రాష్ట్రాల్లో సర్వత్ర ఆసక్తి రేపుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈనెల 6న హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో భేటీ కానున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రుల కీలక సమావేశానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. సమావేశంలో చర్చించాల్సిన ఎజెండాను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. రెండు రాష్ట్రాలు షేర్ చేసుకోవాల్సిన ఉమ్మడి ఆస్తులతోపాటు తెలంగాణ స్వాధీనం చేసుకోవాల్సిన ఆస్తులపైనా ఇప్పటికే మంత్రులు ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ముఖ్యంగా రోడ్లు, భవనాల శాఖకు సంబంధించి ఏపీ ఆధీనంలో ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి ఇప్పటికే స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రధాని మోదీని వేర్వేరుగా కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. నేడు జరగబోతున్న తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రుల భేటీ సఫలం అవుతుందా ? పదేళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా ? అన్న అంశం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ రేపుతోంది.

**ఎక్కడి ఆస్తులు అక్కడే ..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోయి పదేళ్లు దాటింది. 2014లో విభజన జరిగినా.. ఇప్పటికీ సమస్యలు అలాగే ఉన్నాయి. మొన్నటి వరకు ఉమ్మడి రాజధానిగా ఉంటూ వచ్చిన హైదరాబాద్ కాల పరిమితిసైతం ముగిసిపోయింది. ఈ ఏడాది జూన్ 2వ తేదీతో పరిపాలనపరంగా హైదరాబాద్ తో ఏపీకి ఉన్న సంబంధాలు తెగిపోయాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన మెజారిటీ అంశాలు పరిష్కారానికి నోచుకోవట్లేదు. ఎక్కడి ఆస్తులు అక్కడే ఉన్నాయి. వాటి విలువ సుమారు లక్షన్నర కోట్ల

మిగతా 2 లో..

- అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- ఎజెండా సిద్ధం చేసిన తెలంగాణ ప్రభుత్వం
- పదేండ్లైనా పరిష్కారంకాని పునర్విభజన చట్టంలోని కీలక అంశాలు
- ఆస్తులు, సంస్థల పంపకాలపైనే ప్రధానంగా చర్చ
- జూన్ 2తో పూర్తైన హైదరాబాద్ 'ఉమ్మడి రాజధాని' నిబంధన
- ఢిల్లీలో ప్రధాని మోదీని వేర్వేరుగా కలిసిన ఇద్దరు సీఎంలు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తిరేపుతున్న పరిణామాలు
- సమావేశాన్ని స్వాగతిస్తున్న వివిధ పార్టీలు, సంఘాల నేతలు





# గ్రేటర్‌పై అవిశ్వాసం

## మేయర్, డిప్యూటీ మేయర్ వైదొలగాలని బీఆర్ఎస్ డిమాండ్

- నేడు జరగనున్న కౌన్సిల్ సమావేశంలో నిరసనకు పిలుపు
- ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన విజయలక్ష్మి, శ్రీలత
- తెలంగాణ భవన్ లో నిర్వహించిన జీహెచ్ఎంసీ సన్నాహక సమావేశంలో నిర్ణయం
- మీటింగ్‌కు 35 మంది కార్పొరేటర్లు హాజరు
- ఐదుగురు ఎమ్మెల్యేలు డుమ్మా

**హైదరాబాద్, జూలై 5, (ప్రజాస్వరం):** నేడు జరగనున్న జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశానికి కార్పొరేటర్లు, నగర ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరుకావాలని బీఆర్ఎస్ అధిష్ఠానం ఆదేశించింది. తెలంగాణ భవన్ లో నిర్వహించిన జీహెచ్ఎంసీ సన్నాహక సమావేశానికి నగరంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు హాజరయ్యారు. మీటింగ్ కు మొత్తం 35మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు హాజరయ్యారు. ఐదుగురు ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, వివేకానంద, కృష్ణారావు, రాజశేఖర్ రెడ్డి డుమ్మా కొట్టారు. ఈ సందర్భంగా నేడు కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. పార్టీ మారిన మేయర్, మిగతా 2 లో..




## మండలిపై కాంగ్రెస్ పట్టు

ఎమ్మెల్సీల చేరికతో పెరుగుతున్న బలం 2

## బస్సులో ప్రసవం

ప్రయాణంలో గర్భిణికి పురుటినొప్పులు

బస్సు ఆపి... ప్రసవం చేసిన మహిళా కండక్టర్

తల్లీ బిడ్డలు క్షేమం, ఆస్పత్రికి తరలింపు 2

అభినందించిన మంత్రి పొన్నం, ఆర్టీసీ ఎండీ సజ్జనార్





## ప్రత్యేక సలహాదారుడిగా కేశవరావు..!

క్యాబినెట్ ర్యాంక్ ఇవ్వాలని నిర్ణయించాం 2

రెండో సారి కూడా కాంగ్రెస్‌దే అధికారం

మూసీ అభివృద్ధి, త్రిపుల్‌ఆర్ పై దృష్టి పెట్టాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## తొక్కిసలాట బాధాకరం

- బాధితులకు మరింత పరిహారం ఇవ్వాలి
- తగిన ఏర్పాట్లు చేయక పోవడంతో ఘటన జరిగింది
- హథ్రస్ కుటుంబాలకు రాహుల్ గాంధీ పరామర్శ 2



హథ్రస్ బాధితులను పరామర్శిస్తున్న రాహుల్ గాంధీ

## సెట్ గడువు పెంపు

జూలై 8 వరకు పొడిగించిన 'ఉస్మానియా'

ఆగస్టులో ఆన్‌లైన్‌లో పరీక్ష 2

## పీఎం కిసాన్ యోజన రూ. 8 వేలు..!

- మోదీ 3.0లో వ్యవసాయ రంగానికి పెద్దపీట
- 2024 బడ్జెట్‌లో కేటాయింపులపై కసరత్తు
- దేశవ్యాప్తంగా లబ్ధిపొందుతున్న 11కోట్ల మంది రైతులు 2



# భేటీకి వేళాయే..

(మొదటి పేజీ తరువాయి)

రూపాయ లుంటాయని అంచనా. ఈ విభజన సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం కూడా పెద్దగా ఆసక్తి చూపట్లేదు. గతంలో కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా.. రెండు, మూడుసార్లు ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో సమావేశం అయ్యారు. కానీ సమస్యలు పెద్దగా కొలిక్కి రాలేదు. విభజన చట్టాన్ని సవాల్ చేస్తూ పలు పిటీషన్లు సుప్రీంకోర్టులో దాఖలవడం గమనార్హం. ఈక్రమంలోనే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ కానుండటంపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. మరోపక్క ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీని బీజేపీ, బీఆర్ఎస్, తెలంగాణ జన సమితి తదితర పార్టీల నాయకులు స్వాగతించారు. రెండు రాష్ట్రాల ప్రజల సమస్యలపై చర్చించడం మంచి పరిణామమని పలువురు నేతలు పేర్కొంటున్నారు. చర్చలు సఫలీకృతం కావాలని ఆకాంక్షిస్తున్నారు.

**పెండింగ్ లో ఉన్న అంశాలివే...**

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని తొమ్మిదో షెడ్యూల్ లో ఉన్న ఆర్టీసీ, రాష్ట్ర ఆర్థిక సంఘం తదితర 23 కార్పొరేషన్ల ఆస్తులపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. పదో షెడ్యూల్ లోని తెలుగు అకాడమీ, అంబేద్కర్, తెలుగు విశ్వవిద్యాలయం వంటి 30 సంస్థల ఆస్తులు, సేవలపై కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. రాజ్ భవన్, హైకోర్టు, లోకాయుక్త, కార్మిక సంక్షేమ నిధి, వాణిజ్య పన్నులు, విద్యుత్ సంస్థల బకాయిలపైనా వివాదాలున్నాయి. రెండు రాష్ట్రాల అధికారులతో కేంద్ర హోంశాఖ పలు సమావేశాలు నిర్వహించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. ముఖ్యమైన చిక్కులను ముఖాముఖి చర్చలతో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ సీఎం చంద్రబాబు చొరవ చూపడంతో రెండు రాష్ట్రాల మధ్య ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న విభజన సమస్యలు కొలిక్కి రావచ్చని ఇరు రాష్ట్రాలు ఆశిస్తున్నాయి.

# ప్రజావాణికి విశేష స్పందన

**ప్రజాభవన్‌లో దరఖాస్తులను స్వీకరించిన డాక్టర్ చిన్నారెడ్డి**



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డాక్టర్ చిన్నారెడ్డి

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం):** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలు చిన్నారెడ్డిని, ప్రజాభవన్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 594 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 141, పౌరసరఫరాల శాఖ 86 , విద్యుత్ శాఖ 58, హౌసింగ్ 56, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ 54, ఇతర శాఖలకు సంబంధించి 199 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ఇతర అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించండం తో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



బ్రిడ్జిని పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

# ఎమ్మెల్యే అజాగ్రత్తతోనే కూలిన గార్డర్లు

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మంథని జూలై 5, (ప్రజాస్వరం):** ఎంపీ ఎలక్షన్ సమయంలో ముత్తారం మండలం ఓడేడ్ మానేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి మూడు గార్డర్లు గాలికి కూలిపోతే పరిశీలించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు తగిన చర్యలు తీసుకోకుండా అజాగ్రత్తగా వ్యవహరించడం మూలంగానే ఈనాడు మళ్లీ ఐదు గార్డర్లు కూలిపోయాయని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. శుక్రవారం ఓడేడ్ బ్రిడ్జి కూలిన గార్డర్ లను ఆయన పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆనాడు కూలిన గార్డర్లను పరిశీలించిన ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణంలో అవినీతి జరిగిందని, మొత్తం బయటకు తీస్తానంటూ మాట్లాడాడని, మళ్లీ అటువైపు కన్నెత్తి చూడలేదన్నారు. ఆనాడే మూడు గార్డర్లు కూలిపోతే మిగితావి ఎలా ఉన్నాయని, వాటి పరిస్థితి ఏంటని పరిశీలన చేసి తదుపరి చర్యలు తీసుకుంటే ఈనాడు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.50కోట్ల నిధులు తీసుకువచ్చామని, అయితే త్రీ పర్సంట్ లెస్ తో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అలసత్వం వల్ల మధ్యలోనే పనులు ఆగిపోయాయని అన్నారు. అయితే అటు తర్వాత ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీధర్ బాబు ఓడేడ్ బ్రిడ్జి గురించి ఆలోచన చేయలేదని, కనీసం పర్యవేక్షణ చేయలేదన్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో వచ్చి ఓడేడ్ బ్రిడ్జి కూలిన గార్డర్ లను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటే ఈనాడు ఈ విపత్తు జరిగేది కాదని, ఇందుకు నైతిక బాధ్యత ఎమ్మెల్యే వహించాలన్నారు. పీవీ నర్సింహారావు తర్వాత తానే ఈ ప్రాంతంలో బ్రిడ్జిలు నిర్మించిన చరిత్ర ఉందన్నారు. తనలాంటి బీసీ బిడ్డకు అధికారం వస్తే ఎలా ప్రజలకు దూరం చేయాలనే ఆలోచనలు తప్పప్రజలకు మేలు చేయాలనే ఆలోచన ఎమ్మెల్యే కుటుంబం ఏనాడు చేయలేదని విమర్శించారు.

# మల్కాజిగిరిఎమ్మెల్యేపై దాడికి యత్నం

**మేడ్చల్ జూలై 5 ప్రజాస్వరం :** మల్కాజిగిరి రాజకీయ కక్షలతో రణరంగంగా మారింది. మౌలాలి ఆర్టీసీ కాలనీలో రోడ్డు పనులను సందర్శించడానికి వెళ్లిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పై మౌలాలి కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించారు. కొంతకాలంగా డివిజన్ లోని ఆర్టీసీ కాలనీ రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై అనేకసార్లు అధికారులతో చర్చించినా ఫలితం లేకపోయిందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, మాజీ ఎమ్మెల్యే హను మంత రావు చొరవతోనే ఇప్పుడు పనులు ప్రారంభమయ్యాయని కాంగ్రెస్ చెబుతున్నది. ఈ నేపథ్యంలో రోడ్డు పనులను పర్యవేక్షించడానికి ఎమ్మెల్యే రావడంతో కాంగ్రెస్ బీఆర్ఎస్ మధ్య తోపులాట జరిగింది.

# హైకమాండ్ వద్ద రేవంత్ పలుకుబడి తగ్గిందా..?

**కొలిక్కిరాని క్యాబినెట్ విస్తరణ, పీసీసీ చీఫ్ ఎంపిక**

**రేవంత్‌తో పాటు లిస్ట్ ఇచ్చిన మరో ఇద్దరు మంత్రులు**

**హైదరాబాద్, జూలై 5, (ప్రజాస్వరం):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం, ఆధిపత్య పోరు నివురుగప్పిన నిప్పులా ఉందని.. క్యాబినెట్ విస్తరణ ఆగిపోవడం.. పీసీసీ చీఫ్ పదవి పై ఓ అంచనాకు రాలేకపోవడాన్ని బట్టి ఈ విషయం అర్థమవుతుందని రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవుల్ని భర్తీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అనుకున్నారు. ప్రాంతాలు, వర్గాలు సమీకరణాల్ని సిద్ధం చేసుకుని ఐదుగురి పేర్లతో హైకమాండ్ వద్దకు వెళ్లారు. ఒక స్థానాన్ని ఖాళీగా ఉంచాలని అనుకున్నారు. అయితే రేవంత్ కు పోటీగా మరో ఇద్దరు సీనియర్ మంత్రులు.. కేబినెట్ లో ఫలానా వాళ్లకు చోటు కల్పించాలంటూ.. చెరో జాబితా సమర్పించారని తెలుస్తోంది. దీంతో హైకమాండ్ అన్ని పేర్లను పక్కన పెట్టింది. ఏకాభిప్రాయం వస్తుందేమోనని హైకమాండ్ చర్చలు జరిపినప్పటికీ రాకపోవడంతో పక్కన పెట్టేశారు. లోక్ సభ ఎన్నికల్లో ఆశావహులతో గట్టిగా పని చేయించడానికి వాటిని తాయిలాలుగా చూపించాలని ఆరు ఖాళీలు ఉంచారు. కానీ ఇప్పుడా పధవుల భర్తి అంత తేలికగా అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఎందుకంటే ఒక్క రేవంత్ చాయిస్సే కాదు. హైకమాండ్ అనుమతి కూడా ఉండాలి. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మొత్తం ఆరు స్థానాల్లో ఉమ్మడి నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి, రంగారెడ్డి నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్, యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, ఉమ్మడి మహబూబ్ నగర్ నుంచి మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా నుంచి ఒక్క మల్ రెడ్డి మాత్రమే గెలిచారు. తనకు చాన్సివ్వాల్సిందేనని ఆయన పట్టుబడుతున్నారు. ఎంపీగా ఓడిపోతే మంత్రి పదవి ఆఫర్ తో దానం నాగేందర్ పార్టీలో చేరారు. మరో వైపు దామోదర రాజనర్సింహ.. రెండు పేర్లు ప్రకటించేశారు. సీతక్కకు డిప్యూటీ సీఎం ఇస్తారని చెప్పుకొచ్చారు. దీంతో కాంగ్రెస్ లో అలజడి రేగింది. ఇక నామినేటెడ్ పోస్టుల వ్యవహారం తేలడం లేదు. ఎన్నికలకు ముందు కొంత మందికి నామినేటెడ్ పోస్టులు ప్రకటించారు. ఇప్పటికీ జీవో రిలీజ్ చేయలేదు. వాటికే అధికారిక హోదా ఇవ్వకపోతే కొత్తవి ఎప్పుడు భర్తీ చేస్తారోనని కాంగ్రెస్ క్యాడర్ టెన్షన్ పడుతోంది. అధికారంలోకి వచ్చి నెలలు గడిచిపోతున్నాయి. కానీ.. కష్టపడిన దానికి ఫలితం మాత్రం దక్కడం లేదని ద్వితీయ శ్రేణి నేతలు ఫీలవుతున్నారు. పీసీసీ చీఫ్ పోస్టుతో పాటు మంత్రి పదవుల భర్తీని కూడా కొంతకాలం ఆపాలని హైకమాండ్ నిర్ణయంచడంతో రేవంత్ రెడ్డి ఇక పాలనపై దృష్టి పెట్టనున్నారు. ఈ నెలలో ఆయన పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టాల్సి ఉంది. అందులో రుణమాఫీకి నిధులతో పాటు అనేక పథకాలు అమలు చేస్తామని నమ్మకం కలిగించే విధంగా నిధులు కేటాయించాల్సి ఉంది. ముందు ఈ గండాన్ని గట్టెక్కాలని పాలనను దారిలో పెట్టుకోవాలని హైకమాండ్ సూచనలను పాటించేందుకు రేవంత్ రెడీ అయ్యారు. అంతిమంగా రేవంత్ రెడ్డి అనుకున్న విధంగా కాంగ్రెస్ పార్టీపై పూర్తి స్థాయిలో పట్టు సాధించలేకపోయారని అందుకే.. ఆయన జాబితాలను కాంగ్రెస్ పక్కన పెట్టి సీనియర్ నేతల మాటలకు విలువ ఇస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామం సీనియర్లకు మరింత ఉత్సాహం ఇస్తోందని అనుకోవచ్చు.

# ట్రూ కాలర్ అవసరం లేదు

**జూలై 15వ తేదీ నుంచి కొత్త సేవలు**

**కీలక నిర్ణయం తీసుకున్న ట్రాయ్**

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం):** తెలియని వ్యక్తులు, అన్ నోన్ నెంబర్స్ నుంచి కాల్స్ వస్తే ఎవరు చేశారో తెలుసుకునేందుకు ట్రూ కాలర్ యాప్ తో పాటు ఎన్నో యాప్స్ అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిని ఉపయోగించే సమయంలో కొన్ని రకాల సమస్యలు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా ఇలాంటి థర్డ్ పార్టీ యాప్స్ ను ఉపయోగిచే సమయంలో మీ ఫోన్ కాల్స్ కి సంబంధించిన పర్మిషన్స్ యాప్ వాళ్లకు ఇవ్వాల్సి ఉంటుంది. మీ ఫోన్లోని కాంటాక్ట్స్ తో పాటు కాల్ వివరాలను సదరు యాప్స్ చేరుతాయి.అయితే ఇలాంటి సమస్య లేకుండా, అసలు ఏ యాప్ అసవరం లేకుండానే ఇకపై అన్ నోన్ నెంబర్స్ నుంచి వచ్చే కాల్ తెలుసుకోవచ్చు. ఇందుకోసమే టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మీకు వచ్చే కాల్స్ వివరాలు ఏ యాప్ అవసరం లేకుండా స్క్రీన్ పై డిస్ ప్లే అవుతాయి. దీంతో మీకు ఎవరు కాల్ చేశారో తెలుసుకోవచ్చు. ఇందుకోసం ట్రాయ్.. నేమ్ ప్రెజెంటేషన్ సర్వీస్ ను యాక్టివేట్ చేయనుంది. జూలై 15వ తేదీ నుంచి ఈ సేవలను ట్రాయ్ ప్రారంభించనుంది.

# పీఎం కిసాన్ యోజన @ 8 వేలు



**న్యూఢిల్లీ, జూలై 5 :** వ్యవసాయాభివృద్ధికి, రైతుల సంక్షేమం కోసం 2019లో కేంద్రం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రారంభించింది. చిన్న, సన్నకారు రైతులను ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా ఏటా రూ.6 వేల పెట్టుబడి సాయం అందిస్తోంది. మూడు విడతల్లో ఈ సాయాన్ని రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది. ఇదిలా ఉంటే.. మోదీ 3.0 పాలనలో రైతులకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఈక్రమంలో 2024–24 బడ్జెట్ లో వ్యవసాయరంగానికి కేటాయింపులపై కసరత్తు చేస్తోంది. ఈమేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యవసాయ రంగ నిపుణులతో సమావేశమయ్యారు. ఈ బడ్జెట్ లో పీఎం–కిసాన్ కింద అందించే ఆర్థికసాయాన్ని రూ.6 వేల నుంచి రూ.8 వేలకు పెంచాలని నిపుణులు సూచించారు. అదే విధంగా వ్యవసాయ పరిశోధనలకు అదనపు నిధులు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ ద్వారా నేరుగా రైతులకు అన్ని రాయితీలు ఇవ్వాలని కూడా ప్రతిపాదించారు.పీఎం కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 11 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. వీరికి ఏడాదికి మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేలు నేరుగా ఖాతాల్లో జమ చేస్తోంది.

2019 నుంచి ఇప్పటి వరకు రైతులకు రూ.3.24 లక్షల కోట్లు చెల్లించారు. మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక పిఎం కిసాన్ నిధి ఫైల్ పైనే తొలి సంతకం చేవారు. 17వ విడత నిధులు విడుదల చేశారు. ఈ విడతలో 9.3 కోట్ల మంది రైతులకు దాదాపు రూ.20 వేల కోట్లు పంపిణీ చేశారు. ఇదిలా ఉంటే.. కేంద్రం ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ లో 2024–25లో వ్యవసాయానికి రూ.1.27 లక్షల కోట్లు కేటాయించింది. ఈనెల 23 లేదా 24న పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకే కేంద్రం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో ఈ బడ్జెట్ లో వ్యవసాయరంగానికి అదనపు కేటాయింపులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మోదీ ఇప్పటికే రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించారు. ఆమేరకు వ్యవసాయరంగానికి బడ్జెట్ లో ఎక్కువ ప్రాధాన్యం దక్కుతుందని తెలుస్తోంది.

# ఆర్టీసీ బస్సులో ప్రసవం

**ప్రయాణంలో గర్భిణికి పురటినొప్పులు**

**బస్సు ఆపి ప్రసవం చేసిన మహిళా కండక్టర్**



హైదరాబాద్, జూలై 5, (న్యూస్ పల్స్) ఓ లేడీ కండక్టర్ మానవత్వం చాటుకున్నారు. ఆర్టీసీ బస్సులో పురిటి నొప్పుల తో బాధపడుతోన్న ఓ మహిళకు ప్రసవం చేశారు. అదే బస్సులో తల్లీ బిడ్డలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన హైదరాబాద్‌లో శుక్రవారం జరిగింది. ముషీరాబాద్ డిపోకు చెందిన కండక్టర్ సరోజ విధి నిర్వహణలో భాగంగా ఆరాంఘర్ నుంచి ఆర్టీసీ బస్‌లో శుక్రవారం ఉదయం సికింద్రాబాద్ వస్తున్నారు. ఇదే సమయంలో ఓ గర్భిణికి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. ఇది గమనించిన కండక్టర్.. బస్సును పక్కన ఆపించి ప్రయాణికులందరినీ దించేశారు. తోటి మహిళా ప్రయాణికుల సాయంతో ఆమెకు బస్సులోనే ప్రసవం చేశారు. సదరు మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వగా.. అదే బస్సులో తల్లీబిడ్డలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**అభినందించిన మంత్రి, ఎండీ సజ్జనార్**

ఆర్టీసీ బస్సులో మహిళకు ప్రసవం చేసి మానవత్వం చాటుకున్న కండక్టర్ సరోజ, సాయం చేసిన తోటి మహిళా ప్రయాణికులను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సైతం వీరిపై ప్రశంసలు కురిపించారు. అప్రమత్తమై సకాలంలో స్పందించడం వల్లే తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం సహా సేవా భావాన్ని చాటుతున్నారని కొనియాడారు. ఈ మేరకు ట్వీట్ చేశారు.

# గ్రేటర్ పై అవిశ్వాసం

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ మేయర్ తమ పదవుల నుంచి వైదొలగాలని కౌన్సిల్ మీటింగ్ లో బీఆర్ఎస్ డిమాండ్ చేయనుంది. కౌన్సిల్ హాల్లో బైఠాయించి నిరసన తెలపాలని కార్పొరేటర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ డిసెంబర్ తో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు నాలుగేళ్లు పూర్తి అవుతుంది. ప్రస్తుతం ఉన్న సంఖ్యా బలంతో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు తమకే దక్కుతాయంటూ ధీమాను వ్యక్తం చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. ఇదిలా ఉంటే ఇప్పటికే మేయర్, డిప్యూటీ మేయర్లు బీఆర్ఎస్ కండువాతీసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో ఇవాళ బీఆర్ఎస్ అధిష్ఠానం నిర్వహించిన ఈ సమావేశం కీలకంగా మారింది. ఎవరు హాజరవుతారు? ఎవరు హాజరు కావడం లేదనే ఉత్కంఠకు తెరపడింది. ఈ కీలక సమావేశంలో ఐదు మంది ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడం తీవ్రచర్చకు దారితీసింది. వీరిపై అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది అనేది తెలియాల్సి ఉంది.

# మండలిలో కాంగ్రెస్ జోరు

**12కు చేరిన సభ్యుల సంఖ్య**




**హైదరాబాద్ జూలై 5 (ప్రజాస్వరం):** బీఆర్ఎస్ పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఆ పార్టీ నేతలు ఒక్కొక్కరుగా 'కారు' దిగిపోతున్నారు. హస్తం గూటికి చేరుతున్నారు. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. దండే విఠల్, భానుప్రసాద్, బుగ్గారపు దయానంద్, ప్రభాకర్రావు, ఎగ్గే మల్లేశం, బస్వరాజు సారయ్యలు అధికార పార్టీలో చేరారు. వీరంతా గురువారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఆయన ఢిల్లీ నుంచి రావాల్సిన విమానం ఆలస్యమైంది. అర్ధరాత్రి దాటింది. అప్పటి వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు రేవంత్ నివాసంలోనే ఉన్నారు. ఢిల్లీ నుంచి రాగానే ఆయనతో భేటీ అయ్యారు. ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల చేరికతో శాసనమండలిలో కాంగ్రెస్ బలం 12కు చేరింది. మండలిలో కూడా ఆధిక్యం కోసం కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది.

అందులో భాగంగానే బీఆర్ఎస్ సభ్యులను ఆకర్షిస్తోంది. గతంలో రాజకీయ పునరేకీకరణ అంటూ కేసీఆర్ చూపిన బాటలోనే ఇప్పుడు రేవంత్ కూడా పయనిస్తున్నారు. తన ప్రభుత్వానికి ఢోకా లేకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆపరేషన్ ఆకర్ష్ శ్రీకారం చుట్టారు. శాసనమండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 40 కాగా.. 2 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాంగ్రెస్‌కు ప్రస్తుతం ఆరుగురు సభ్యులున్నారు. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న ఇద్దరు సభ్యులు కూడా అధికార కాంగ్రెస్ తరపునే ఉంటారు. మొత్తం 8 మంది అవుతారు. తాజాగా ఆరుగురు చేరడంతో కాంగ్రెస్ బలం 14కు చేరుతుంది. అవసరమైనప్పుడు వామపక్ష టీచర్ ఎమ్మెల్సీ మద్దతు కూడా కాంగ్రెస్ కే ఉండే అవకాశం ఉంది. ఇక కాంగ్రెస్ కు మరో ఐదారు సీట్లు ఉంటే మెజారిటీ దక్కుతుంది. బీజేపీకి ఇద్దరు సభ్యులు ఉన్నారు. వీరు బీఆర్ఎస్ తో కలిసి పనిచేసే అవకాశం లేదు. అప్పుడు కీలక బిల్లుల విషయంలో రేవంత్ సర్కారుకు ఊరట లభిస్తుంది.

# ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడిగా కేశవరావు!

**క్యాబినెట్ ర్యాంక్ ఇవ్వాలని నిర్ణయించాం**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, జూలై 5, (ప్రజాస్వరం):** మాజీ ఎంపీ కేశవరావుకు తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడిగా క్యాబినెట్ ర్యాంక్ ఇవ్వాలని అనుకుంటున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కేశవరావు రాజీనామా విషయంలో కాంగ్రెస్ పార్టీ అంతా కలిసి నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చెప్పారు. ఢిల్లీ పర్యటలో భాగంగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అనంతరం సీఎం ఢిల్లీలోని కేకే నివాసానికి వెళ్లారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి కేశవరావు స్వాగతం పలికి ఇంట్లోకి ఆహ్వానించారు. ఇకపై కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రానికి ఏది మంచో కేకే నిర్ణయం తీసుకుంటారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. ఆయన సలహా మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణలో ఒక పార్టీ అధికారంలోకి వచ్చాక పదేళ్లు పక్కా ఉంటుందని, రెండోసారి కూడా కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. మూసీ అభివృద్ధి, రీజనల్ రింగు రోడ్డుపై దృష్టి పెట్టామని, ఎటువంటి గందరగోళం లేకుండా 11 వేలకుపైగా టీచర్ల బదిలీలు చేశామని అన్నారు.

**కాంగ్రెస్ నా సొంత ఇల్లు : కేకే**

కాంగ్రెస్ తన సొంత ఇల్లు అని, తాను ఆ పార్టీ మనిషిని అని ఈ సందర్భంగా కేకే పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీలతోనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినందుకు సంతోషంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో పాలన ఇప్పుడు ప్రజస్వామ్యబద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. ఆరు నెలల్లో ఎవరినీ అంచనా వేయలేమని, ఆరు నెలల్లో ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని చూశామని తెలిపారు. ఫ్యామిలీ పబ్లిసిటీ అనేది గత ప్రభుత్వంలో ఉన్న వారు చేశారని విమర్శించారు. నైతిక విలువలతో తాను రాజీనామా చేశానని, ఇదే విషయాన్ని రాజీనామా సమయంలో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ కు కూడా చెప్పాను అని పేర్కొన్నారు.

# తొక్కిసలాట బాధాకరం: రాహుల్ గాంధీ

**హథ్రస్ బాధిత కుటుంబాలకు పరామర్శ**

**అలీగఢ్ జూలై 5:** లోక్ సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ శుక్రవారం హథ్రస్ ను సందర్శించి, తొక్కిసలాట మృతుల కుటుంబాలను పరామర్శించారు. మతపరమైన కార్యక్ర మానికి పోలీసులు తగిన ఏర్పాట్లు చేయలేదని, ఇదే తొక్కిసలాటకు దారితీసిందని మృతుల బంధువులు చెప్పారని ఆయన తెలిపారు. ఈ విషాదాన్ని రాజకీయం చేయదలచుకోలేదని రాహుల్ గాంధీ అన్నారు. కాగా మృతుల కుటుంబాలకు మరింత పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు."ఇది బాధాకరమైన సంఘటన. చాలా మంది మరణించారు. నేను ఈ విషయాన్ని రాజకీయ కోణం నుండి చెప్పదలచుకోలేదు, కానీ పరిపాలనలో లోపాలు ఉన్నాయి, ముఖ్యమైన విషయం ఏమిటంటే వారు పేదవారు కాబట్టి గరిష్ట పరిహారం ఇవ్వాలి. నష్టపరిహారం విషయంలో జాప్యం జరిగితే ఎవరికీ ప్రయోజనం ఉండదని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ని కోరుతున్నాను వారు షాక్ లో ఉన్నారు, నేను వారి పరిస్థితిని అర్థం చేసుకోగలను" అని రాహుల్ గాంధీ సమావేశం అనంతరం తెలిపారు.

# సెట్ గడువు పెంపు

**హైదరాబాద్, జూలై 5, (ప్రజాస్వరం):** తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ సెట్)–2024 ఆన్ లైన్ దరఖాస్తులకు తుది గడువును పొడిగిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ప్రకటన వెలువరించింది. రాష్ట్రంలోని యూనివర్సిటీలు, డిగ్రీ కాలే జీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లుగా పనిచేయడానికి అర్హత కల్పించే సెట్ పరీక్ష కు ఈ ఏడాది మే 4న నోటిఫికేషన్ వచ్చింది. ఆన్ లైన్ దరఖాస్తు ప్రక్రియ మే 14న మొదలవగా.. జులై 2తో దరఖాస్తు గడువు ముగిసింది. అయితే తాజాగా దరఖాస్తు గడువును జులై 8వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రకటన వెలువడింది. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా జులై 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.1500 ఆలస్య రుసుముతో జులై 16 వరకు, రూ.2000 ఆలస్య రుసుముతో జులై 26 వరకు, రూ.3000 ఆలస్య రుసుముతో ఆగస్టు 6 వరకు దర ఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.ఆగస్టు 8, 9 తేదీల్లో దరఖాస్తు సవర ణకు అవకాశం ఉంటుంది. ఇక ఆగస్టు 28, 29, 30, 31 తేదీల్లో ఆన్ లైన్ విధా నంలో సెట్ పరీక్షలు జరగనుంది. ఇందుకు సంబంధించి హాల్ టికెట్లు ఆగస్టు 20, 2024 తేదీ నుంచి వెబ్ సైట్ లో డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రకటనల విడుదల చేసింది. జనరల్ స్టడీస్, 29 సబ్జెక్టుల్లోఈ పరీక్ష జరుగనుంది. తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష (టీజీ సెట్) – 2024కు దరఖా స్తు చేసుకునే అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులతో సంబంధి సబ్జెక్టులో ఎంఏ, ఎంస్సీ, ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంటెక్ (సీఎస్ఈ, ఐటీ)లలో ఏదైనా ఒకదానిలో పీజీ డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి. ఎలాంటి వయోపరిమితి ఉండదు. సీబీటీ పద్ధతిలో జరిగే ఈ పరీక్షకు రెండు పేపర్లు ఉంటాయి. పేపర్ 1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్ 2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రిసెర్చ్ ఆప్టిట్యూడ్ (పేపర్ 1), పేపర్ 2లో జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ & అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్, మేనేజ్ మెంట్, హిందీ, హిస్టరీ, లా, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్ మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్ సబ్జెక్టులకు పరీక్ష ఉంటుంది.

# జలమండలి ముందు ధర్నా

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :**
పాత బస్తీ హనుమాన్ నగర్ లో డ్రైనేజీ వ్యవస్థ పనిచేయకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ బస్తీవాసులు రియాసత్ నగర్ లోని జలమండలి జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు బిజెపి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ర్షపు నీరు నిల్వ ఉండడం, మురుగు రోడ్లపై పారుతుండడంతో దోమలు, ఈగలు పెద్ద ఎత్తున వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. దీనికి తోడు తాగునీరు కూడా కలుషితమవుతుండడంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు మున్ముందు ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలందరూ రోగాలతో మంచాన పడడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు.నీటి సమస్యను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# పెద్ద చెరువులో మృతదేహం లభ్యం

**రంగారెడ్డి, జూలై 5 (ప్రజాస్వరం) :**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో గుర్తు తెలియని 55 సంవత్సరాల వ్యక్తి మృతదేహం లభ్యమైంది.చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం మార్చ్యూరికి తరలించారు.

## ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి..
# సొంత భవనం కరువు

**స్థలం కేటాయించిన నిధులు ఇవ్వని ప్రభుత్వం**

**బద్వేలు, జూలై 5 (ప్రజాస్వరం) :**
బద్వేలు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి సొంత భవనం కరువైంది దశాబ్దాల తరబడి స్థానికంగా ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఉంది సర్కిల్ పరిధిలో సుమారు ఏడు మండలాలు ఉన్నాయి సర్కిల్ కార్యాలయం మొదట్లో స్థానిక అశోక్ నగర్ లోని ఒక అద్దె భవనంలో ఉండేది అక్కడ కొన్ని సంవత్సరాల తర్వాత ఆ ఇంటి యజమాని ఖాళీ చేయమని చెప్పడంతో పట్టణంలోని మరో బాడుగ ఇంట్లోకి కార్యాలయాన్ని తరలించారు అక్కడ కూడా కొన్ని సంవత్సరాలు ఉన్న తర్వాత కాళీ చేయవలసి వచ్చింది ఆ తరువాత స్థానిక సిద్ధవటం రోడ్ లోని తెలుగు గంగ కాలనీకి వెళ్లే దారిలో మరో అద్దె భవనంలో కార్యాలయాన్ని తరలించారు అక్కడ దాదాపు18 సంవత్సరాల పాటు కొనసాగింది తర్వాత ఆ ఇంటి యజమాని కూడా కాళీ చేయమని చెప్పడంతో అదే రోడ్డులోని మార్కెట్ యార్డ్ కార్యాలయంలో ఉన్న భవనంలోకి కార్యాలయాన్ని తరలించారు కార్యాలయం తరలించిన కొద్ది రోజుల్లోనే అప్పటి మహిళ సీఐ హిమబిందు భారీ మొత్తంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు ఆ తరువాత వచ్చిన సిఐ కూడా ఇదే తరహాలో వ్యవహరించి సస్పెండ్ కు గురయ్యారు దాంతో మార్పు చేసిన కార్యాలయం అచ్చి రాలేదని ఆ తర్వాత వచ్చిన అధికారులు పూజలు చేసి వినాయక విగ్రహాన్ని కార్యాలయం ముందు భాగంలో ఉంచారు ఆ విగ్రహం ఇప్పటికీ కార్యాలయం ముందు భాగంలో ఉంది ఎక్సైజ్ కార్యాలయం కోసం సిబ్బంది నివాస గృహాల కోసం స్థానిక బ్రేక్ ఇన్స్పెక్టర్ కార్యాలయం పక్కనే దాదాపు రెండు దశాబ్దుల క్రితం స్థలం కేటాయించారు కానీ ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదు దీంతో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం అద్దె భవనాలకే పరిమితమైంది కేటాయించే స్థలంలో పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని స్థానిక అధికారులు పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు కానీ నిధులు మాత్రం మంజూరు కాలేదు దీంతో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం అద్దె భవనాలకే పరిమితమైంది మద్యం అమ్మకాల వల్ల ప్రభుత్వానికి మంచి రాబడి వస్తుంది రాబడి తెచ్చే కార్యాలయానికి సొంతగూడు లేకపోవడం విచారకరం

# పేదల ముసుగులో అస్మదీయులకు ఇంటి స్థలాల కేటాయింపు

**బద్వేలు, జూలై 5 (ప్రజాస్వరం) :**
మాజీ ముఖ్య మంత్రి అప్పట్లో జగనన్న 90రోజులు కార్యక్రమం ద్వారా సామాన్యులకు లబ్ధిచేకూరు సంగతి దేవుడెరుగు కానీ, అధికార పార్టీ నేతలకే అధిక లబ్ది చేకూరుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి స్థలాలు కేటాయించాలని వందలాది మంది పేదలు పెట్టుకున్న అర్జీలకు అతీగతి లేదని, అధికార పార్టీ నేతలు కోరిందే తడవుగా, అధికారులు ఆగమేఘాల మీద నేతల బినామీలకు ఇంటి పట్టాలు మంజూరు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తాజాగా సిద్దమ్మ తల్లి గుడి సమీపంలో ఇంటి పట్టాలు మంజూరైన వైనం చర్చ నీయాంశంగా మారింది. గోపవరం గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్515-1లొ అధికార పార్టీకి చెందిన ఓ రాష్ట్ర కోర్పొరేషన్ డైరెక్టర్, గోపవరం మండల పరిధిలోని ఓ ప్రముఖ శైవ క్షేత్ర పాలక మండలి చైర్మన్ తోపాటు,ఓ ఉన్నతాధికారి నివాసం ఉంటున్న ఇంటి యజమాని వీరు ముగ్గురు,పలుకుబడి ఉపయోగించితమ బినామీలైన12మందికి ఇంటి పట్టాలు పొందినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు 90రోజుల్లో ఇంటి పట్టాలు మంజూరు చేయాలనే సమున్నతాశయంతో రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న 90డేస్ ను స్థానిక అధికార పార్టీ నేతలు తమ లబ్ది కోసం చక్కగా వినియోగించు కుని తమ బినామీల పేర్లపై డికెటీలు పొందడం పై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.పేదవాడు జానెడు జాగా కోసం కాళ్లరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా ప్రయోజనం లేని నేపథ్యంలో అధికారులు అప్పటిఅధికారపార్టీ నేతలు వత్తిళ్లకు తలొగ్గి విలువైన ప్రభుత్వ స్థలాలను నేతల బినామీలకు కట్టబెట్టడంలో గల ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు ప్రభుత్వ అవసరాల కోసం ఉపయోగించకుండా అత్యంత ఖరీదైన కోట్ల రూపాయలు విలువచేసే భూమిని అధికార పార్టీ నాయకులకు పట్టాలి ఇవ్వడం పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.నిబంధనల మేరకు రిమోట్ ఏరియాలో ఇంటి స్థలాలను మంజూరు చేయాల్సివుండగా నిబంధనలను తుంగలో తొక్కి జాతీయరహదారికి ఆనుకుని స్థలాలను మంజూరు చేయడంలో గల ఆంతర్యమేమిటన్నారు.గత సంవత్సరం ఇదే ప్రాంతంలో అప్పటి అధికారపార్టీకి చెందిన కొంతమంది ఆక్రమణలకు యత్నించగా మునుపటి బద్వేలు ఆర్డీఓనే ఆ కబ్జాలను అడ్డుకుని ఆ ప్రాంతంలో బోర్డు ఏర్పాటు చేయించడం గమనార్హం.ఉన్నతాధికారుల ఆదేశాలతోనే:ఉన్నతాధికారుల ఆదేశాల కనుగుణంగానే515-1లొలే ఔట్ వేసి12మందికి ఇంటి స్థలాలు మంజూరు చేసి పట్టాలు పంపిణీ చేశామని మునుపటి గోపవరం తాసిల్దార్ తెలియజేశారు.

# బీసీలకు రిజర్వేషన్లు 54 శాతం పెంచాలి

బీసీలకు రిజర్వేషన్లు 54 శాతం పెంచాలనిజాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య కోరారు.స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లను జనాభా ప్రకారం 54% పెంచాలని, రాజ్యాంగాన్ని సవరించాలని, కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ జాతీయ బిసి సంక్షేమ సంగం అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కలిసి నీరడి భూపేష్ సాగర్ మరియు రాజ్ కుమార్ నీల వెంకటేష్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు తదితరులు చర్చలో పాల్గొనడం జరిగింది.



# మీ - సేవలో అంతా దోపిడీయే

లంచం ఇస్తే కులం మారిపోతుంది..
సాంకేతిక ఎక్కువై ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కులు
ఎమ్మార్వో లాగిన్ ఐడీ నుంచి సంతకాల వరకూ..
నకిలీ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు
ఇరువురిపై 420, 409 సెక్షన్ల కింద కేసులు నమోదు
పలు మీ సేవ కేంద్రాలలో విచారణ
లోతైన విచారణతో అక్రమాలు బయట పడే అవకాశం

**అక్కడ ఎడాపెడా కులం, ఆదాయ సర్టిఫికెట్లు బహిరంగంగా దొరుకుతాయి. లంచం ఇస్తే చాలు కులం మారిపోతుంది. ముడుపులు చెల్లిస్తే చాలు ఆదాయం తగ్గించి సర్టిఫికెట్లు ఇచ్చేస్తారు. సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువైపోయి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు.**

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :**
రంగారెడ్డి జిల్లా మంచాల ఎమ్మార్వో ఆఫీసు అక్రమార్కులకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. రాంగ్ రూట్ లో సర్టిఫికెట్లు క్రియేట్ చేస్తూ భారీ స్కామ్ కు పాల్పడ్డారు. ఎవరికీ అనుమానం రాకుండా ఎస్ టీ పీ ఆపరేటర్-2 పేరుతో లాగిన్ అయి మూడు వేర్వేరు ఫోన్ నెంబర్లతో భారీ ఎత్తున అక్రమార్జనకు పాల్పడ్డారు. ఎమ్మార్వో లాగిన్ ఐడీ నుంచి ఆయన సంతకాల వరకూ ఈ టెక్నాలజీని విచ్చలవిడిగా వాడుకున్నారు.ఇప్పటిదాకా సుమారు వెయ్యికి పైగా స్థానికేతరులకు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు జారీ చేశారని సమాచారం. . ఫీజ్ రియంబర్స్మెంట్ , స్కాలర్ షిప్, ప్రభుత్వ పథకాలకు అడ్డదారిలో సర్టిఫికేట్లు మంజూరు చేయడమే వీరి ప్రత్యేకత. కొంతమంది నిందితులు ఓ గ్యాంగ్ గా ఏర్పడి హైదరాబాద్ లోని పలు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేయిస్తూ అక్రమార్జనలకు పాల్పడుతున్నారు. అర్జీదారులు లేకుండానే సర్టిఫికెట్లు విడుదల చేయడం..సంబంధిత సర్టిఫికెట్లను సీక్రెట్ గా ఇంటికే పంపించడం వంటి వ్యవహారాలు చేస్తున్నారు. ఇందుకు గాను దరఖాస్తుదారులనుంచి అడ్డగోలుగా దండుకున్నారు. సదరు ఈ గ్యాంగ్ కొంత మంది బ్రోకర్లను మీ సేవా సెంటర్ల వద్ద కాపుగాయించి సర్టిఫికెట్లు కావలసిన వారికి ఒక్కో దానికి ఇంత చొప్పున వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో సర్టిఫికెట్ వాల్యూను బట్టి రూ.50 వేల నుంచి 5 లక్షల దాకా వసూళ్లకు పాల్పడినట్లు తెలిసంది.అయితే ఈ వ్యవహారం అంతా వీఆర్వో, డీటీ, ఆర్ ఐ వంటి అధికారుల ప్రమేయం లేకుండానే గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్నారు. రెండేళ్లుగా ఈ వ్యవహారాన్ని ఇష్టారాజ్యంగా నడిపిస్తున్నా పట్టించుకున్న నాధుడే లేడు. ఇప్పటిదాకా వెయ్యికి పైగా సర్టిఫికెట్లు జారీ చేసి భారీగా సొమ్ములు అందిపుచ్చుకున్నట్లు తెలిసింది. ఇక తహశీల్దార్ కు సంబంధించి డిజిటల్ కీ సంతకంతో వందల సంఖ్యలో అనునిత్యం సర్టిఫికెట్లు క్రియేట్ చేస్తూ అందినకాడికి సొమ్ము చేసుకున్నారు.రంగారెడ్డి జిల్లా మైనార్టీ కార్యాలయం నుంచి మండల కార్యాలయానికి ఈ అక్రమాలపై ఆకాశ రామన్న ఉత్తరం రావడంతో స్వయంగా అధికారులు రంగంలోకి దిగారు. భారీ స్కామ్ నిజమేనని గుర్తించారు. దీనితో నిందితుల గుట్టు రట్టయింది. తీగలాగితే డొంక కదిలిన చందంగా రెండేళ్లుగా అడ్డూ అదుపూ లేకుండా నిందితులు జరిపిన స్కామ్ వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. అయితే ఈ నిందితుల వద్దకు వచ్చిన వారంతా ఇతర ప్రాంతాలకు చెందిన వారు కావడం గమనార్హం. మీ సేవా కేంద్రాలలో కుప్పలుగా అప్లికేషన్లు పడివుండటంతో పరిశీలనకు వచ్చిన ఎమ్మార్వో కార్యాలయ అధికారులు ఒక్కసారిగా ఖంగు తిన్నారు. తమ ప్రమేయం లేకుండానే ఇవన్నీ జరుగుతున్నాయా అని ఉలిక్కిపడ్డ అధికారులు జరిగిన భారీ స్కామ్ పై మంచాల పరిధిలోని పోలీస్ స్టేషన్లో రంగారెడ్డి ఎమ్మార్వో ఫిర్యాదు చేశారు. ఈ భారీ స్కామ్ కు పాల్పడ్డ కంప్యూటర్ ఆపరేటర్ ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సాయంతో ఈ అక్రమాలకు పాల్పడ్డాడని తేలడంతో వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిద్దరిపై 420, 409 సెక్షన్ల కింద కేసులు నమోదుచేశారు పోలీసులు. కాగా వీరి వెనక ఇంకా ఎవరెవరు ఉన్నారో? వారి పాత్ర ఏమిటో కూడా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఈ విషయం బయటకు తెలిస్తే తమ ఉద్యోగాలు ఎక్కడ పోతాయో అని భయపడుతున్నట్లు తెలుస్తోంది.రంగారెడ్డి ఎమ్మార్వో పరిధిలోని మీ సేవలో జరిగిన అక్రమాలు మాదిరిగా రాష్ట్రంలో ఇంకా ఎక్కడెక్కడ మీ సేవా సెంటర్లలో ఇలాంటివి జరుగుతున్నాయో అని ఎంక్వైరీ చేస్తున్నారు. లోతుగా వెళితే మరిన్ని మీ సేవ అక్రమాలు బయటకొచ్చే అవకాశం ఉంది.




## కడప-రాయచోటి ఘాట్లో 6 కి.మీ.
# సొరంగ మార్గం

**ఆకివీడు-దిగమర్రు రహదారికి రూ. 1,200 కోట్లు**
**హైవేల పనులకు రూ. 4,744 కోట్లతో వార్షిక ప్రణాళికకు మోర్త్ ఆమోదం**

**అమరావతి, జూలై 5 (ప్రజాస్వరం) :**
కడప- రాయచోటి ఘాట్ రోడ్డు (గువ్వల చెరువు ఘాట్)లో వాహనదారుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. ప్రమాదకరంగా ఉండే ఈ ఘాట్కు ప్రత్యామ్నాయంగా.. ఆ కొండకు సొరంగం తవ్వి, నాలుగు వరుసల రహదారి నిర్మించేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఇందుకు రూ. 1,000 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రంలో మొత్తంగా 14 జాతీయ రహదారులకు నిధులు మంజూరు చేసింది. రూ.4,744 కోట్లతో 2024-25 వార్షిక ప్రణాళికకు రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) ఆమోదం తెలిపింది.* కర్నూలు-చిత్తూరు ఎన్హెచ్లో భాగంగా కడప-రాయచోటి మధ్య ఉన్న ఘాట్లో 6 కి. మీ. మేర సొరంగం నిర్మించనున్నారు. నాలుగు వరసల రహదారికి వీలుగా ఒక్కటే పెద్ద సొరంగం గానీ, లేక రెండేసి వరసల రోడ్లకు రెండు సొరంగాలు గానీ తవ్వి.. రోడ్లు వేయనున్నారు. వీటికి ఇప్పటికే కన్సల్టెంట్ను నియమించారు. ఆ సంస్థ వివిధ చోట్ల బోర్లు వేసి, ఆ కొండలో రాయి ఎక్కడెక్కడ గట్టిగా ఉందనేది అధ్యయనం చేస్తోంది. ఇది పూర్తయ్యాక ఎలైన్మెంట్ ఖరారు చేసి, డీపీఆర్ సిద్ధం చేస్తారు.

# మొక్కలు నాటాలి...సంరక్షణ చేయాలి



**హుస్నాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :**
పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరితో కలిసి మొక్కలు నాటారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తల్లి పేరు మీద ప్రతి ఒక్కరు ఒక మొక్కలు నాటాలని దేశ ప్రధానమంత్రి చెప్పారు. మీరు కూడా మీకు ఇష్టమైన వారి పేరు మీద మొక్కను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలి. మాస్కు, ఆక్సిజన్ ఎప్పటికీ పెట్టుకునే రోజులు రాకూడదంటే మన తక్షణ కర్తవ్యం వాతావరణ సమతుల్యాన్ని కాపాడుకోవడం కోసం మొక్కలను నాటి సంరక్షించుకోవడమే. సమాజంలో భావి భారత పౌరులుగా పాఠశాల స్థాయి నుండి ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనాలి. అన్ని ఈవెంట్లలో విద్యార్థులు గెలిచిన ఓడిన పాల్గొనాలి. నాకెందుకులే అని కాకుండా నేను నేర్చుకోవాలి అనే పోరాట పటిమ ప్రదర్శించాలి. పోరాట పటిమ ఉన్నవాళ్లే చరిత్రలో నిలుస్తారు జిల్లాలో 21 లక్షల మొక్కలు నాటుటకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో హుస్నాబాద్ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉండేలా వన మహోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలి. ప్రభుత్వం మోడల్ స్కూల్ అందరిదీ.. తర్వాత జనరేషన్ విద్యార్థులకు మంచిగా అందించేలా ప్రస్తుత విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలి. పాఠశాలలో అవసరమైన అన్ని వసతులను సమకూరుస్తాము. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన వాతావరణాన్ని క్లీన్ గా మరియు గ్రీన్ గా ఉంచుకోవాలంటే మొక్కలను నాటి పెద్ద చేయడం ఒకటే మార్గం. గ్రీనరీ ని పెంచుటకు ప్రతి ఒక్క విద్యార్థి ఒక మొక్కను నాటి దాన్ని సురక్షితంగా సంరక్షించాలి. గెలుపు, ఓటములు సాధారణం ప్రతి విద్యార్థి తప్పనిసరిగా అన్ని రకాల కాంపిటేషన్లలో పాల్గొనాలి. తద్వారా జీవితంలో ఏ విషయంలోనైనా కాన్ఫిడెన్స్ పెరుగుద్ది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమ అగ్రవాల్, హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకన్న, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్, హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అనతి కాలంలోనే ఆదర్శ పాలన అందించాం: కెసిఆర్

**గజ్వేల్, జూలై 5 (ప్రజాస్వరం) :**
దేశంలో రైతు రాజ్యం తెచ్చుకోవాలని భారాసతో కలిసి అడుగులేస్తూ ముందుకు కదిలిన మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల ప్రజలు మొన్నటి తెలంగాణ ఎన్నికల ఫలితాలతో తీవ్ర ఆవేదన చెందారని ఆ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ, నర్సాపూర్, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల నుంచి తనను కలిసేందుకు వచ్చిన వారినుద్దేశించి ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం అనతికాలంలోనే ఆదర్శంగా పాలన అందించిందని. విద్యుత్, సాగు, తాగునీరు, వ్యవసాయం తదితర రంగాల్లో భారాస ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యాచరణ దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా కొనసాగిందని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ ప్రగతిని చూసి మహారాష్ట్ర వంటి పక్క రాష్ట్రాల ప్రజలు తమకూ కేసీఆర్ పాలన కావాలని కోరుకున్నారని తెలిపారు. కేసీఆర్ పాలన లేకపోవడం వల్ల తెలంగాణ రైతుల కంటే మహారాష్ట్రతో పాటు దేశ రైతాంగమే తీవ్రంగా నష్టపోయిందని ఇటీవల తనను కలిసిన మహారాష్ట్ర నేతలు అన్నారని భారాస అధినేత వివరించారు. భారాస ఓటమితో రైతురాజ్యాన్ని అందించగల కేసీఆర్ దార్శనిక నాయకత్వాన్ని దేశం కోల్పోయిందని బాధపడ్డారని తెలిపారు.



# గుడుంబా స్థావరంపై జిల్లా పోలీసుల దాడులు

**6 లీటర్ ల గుడుంబా పట్టివేత 90 లీటర్ ల బెల్లం పానకం ధ్వంసం**



**జగిత్యాల, జూలై 5 (ప్రజాస్వరం) :**
గుడుంబా రహిత జిల్లా గా మార్చడమే జిల్లా పోలీసుల లక్ష్యం. గుడుంబా రహిత జిల్లాగా జగిత్యాలను చూడాలనే ప్రధాన లక్ష్యంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఈరోజు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ తండాలో గుడుంబా స్థావరాలపై పోలీసులు మరియు ఎక్సైజ్ శాఖ వారితో సంయుక్తంగా దాడులు నిర్వహించడం జరిగింది. ఈ యొక్క దాడిలో 6 లీటర్ల గుడుంబాను,90 లీటర్ ల బెల్లం పానకం స్వాధీనం చేసుకొని గుడుంబా స్థావరాని ధ్వంసం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ. ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారీ చేసినట్లయితే వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గుడుంబాకు అలవాటు పడి ఎంతోమంది కుటుంబాలను చిన్నబిన్నం చేసుకొని చివరకి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. అంతే కాకుండా మీ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఎవరైనా గుడుంబా తయారీ చేస్తునట్టు తెలిసిన, అమ్మిన వెంటనే పోలీసు స్టేషన్ కి సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గొప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. ఈ యొక్క తనిఖీల్లో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వినోద్ రాథోడ్, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సేవకుడని నిరూపిస్తున్న లోకేష్

## ప్రజాదర్బార్ తో సరికొత్త సాంప్రదాయానికి యువనేత నాంది

## 12వ రోజు మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నపాలు

**అమరావతి, జూలై 5 (ప్రజాస్వరం) :**
ప్రజాప్రతినిధి అంటే సేవకుడని నిరూపిస్తూ కష్టాల్లో ఉన్న ప్రజలకు నేనున్నానని భరోసా నిస్తున్నారు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్. తొలుత మంగళగిరి ప్రజలకోసమని మొదలు పెట్టిన ప్రజా దర్బార్ కు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వినతులు వెల్లువెత్తుతున్నాయి. కేవలం వినతిపత్రాలు తీసుకోవడంతోనే తమ బాధ్యత తీరినట్లుగా భావించకుండా సంబంధిత వినతిపత్రాలను ఆయా శాఖలకు పంపి పరిష్కరించేందుకకు ప్రత్యేకమైన యంత్రాంగాన్ని ఏర్పాటుచేశారు. దీంతో లోకేష్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కు వెళితే తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజలకు బలమైన నమ్మకం ఏర్పడింది. ఉండవల్లి నివాసంలో 12వ రోజు కొనసాగిన "ప్రజాదర్బార్"కు మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు భారీగా తరలివచ్చారు. యువనేతను నేరుగా కలిసి తమ కష్టాలు ఏకరవు పెట్టారు. పెన్షన్ ల కోసం వృద్ధులు, వికలాంగులు, మహిళలు, ఉద్యోగాల కోసం యువత, సమస్యల పరిష్కారం కోసం వివిధ విభాగాల ఉద్యోగాలు, విద్య, వైద్య సాయం కోసం సామాన్యులు, తాము ఎదుర్కొంటున్న కష్టాల నుంచి గట్టెక్కేందుకు బాధితులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆయా సమస్యలను విన్న మంత్రి లోకేష్ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గంజాయి మత్తులో దాడులకు పాల్పడుతున్నారు. తాడేపల్లి పట్టణం, సీతానగరం గోరా కాలనీకి చెందిన పలువురు యువకులు గంజాయి మత్తులో దాడులకు పాల్పడుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కే.ఆంజనేయ ప్రసాద్, మాచర్ల అఖిల్ మంత్రి లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. స్థానికంగా ఉండే కట్టా భరత్ అనే వ్యక్తి గంజాయి మత్తులో కత్తితో దాడి చేయగా తాను తీవ్రంగా గాయపడ్డానని, ఇరుగుపొరుగు వచ్చి ప్రాణాలు రక్షించారని ఆంజనేయప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి మత్తలో తనపై దాడి చేసిన కట్టా భరత్.. సెల్ ఫోన్, నగదు లాక్కున్నాడని, తన తల్లిదండ్రులను హతమారుస్తానని బెదిరించాడని మాచర్ల అఖిల్ వాపోయారు. ఫోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన స్పందన లేదన్నారు. గంజాయి బ్యాచ్ నుంచి తమకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను విన్న మంత్రి లోకేష్... గంజాయి బ్యాచ్ ఆగడాలు పూర్తి స్థాయిలో అరికడతామని హామీ ఇచ్చారు.

**ఉద్యోగం కల్పించి ఆదుకోవాలి...**
విద్యుత్ బిల్లు కారణంగా గత ప్రభుత్వం తొలగించిన రేషన్ కార్డ్, పెన్షన్ పునరుద్ధరించాలని మంగళగిరికి చెందిన వి.వీరభద్రరావు లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. భర్త చనిపోయిన తనకు వితంతు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన పిన్నిక పార్వతి కోరారు. అంగవైకల్యం బారిన పడిన తనకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని మంగళగిరికి చెందిన డి.శ్రీనివాసరావు కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్నానని, తన ఇద్దరు పిల్లల చదువు భారంగా మారిందని, ఆర్థిక సాయం చేయాలని ఉండవల్లికి చెందిన వై.దుర్గ కోరారు. డిగ్రీ చదివిన తనకు ఉద్యోగం లేక కుటుంబ పోషణ భారంగా మారిందని, ఏదైనా ఉద్యోగం కల్పించాలని విజయవాడకు చెందిన మడక రమ్య విజ్ఞప్తి చేశారు. మంచానికే పరిమితమైన తన కుమార్తెకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని గుంటుపల్లికి చెందిన వెలమాటి శ్రీనివాస్ కుమార్ విజ్ఞప్తి చేశారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని యువనేత భరోసా ఇచ్చారు.



# ఉమామహేశ్వర స్వామి వారిని దర్శించుకున్న మంత్రులు

నాగర్ కర్నూలు, జూలై 5 (ప్రజాస్వరం) :
అచ్చంపేట నియోజకవర్గం.. రంగాపురం లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం ఉమామహేశ్వర స్వామి వారిని వైద్య , ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకున్నారు. మంత్రుల వెంట ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన శాసన సభ్యులు పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రులకు ఆలయ అధికారులు, పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు ఆశీర్వదించారు. ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, వాకిటి శ్రీహరి, డా. రాజేష్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి,



మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు.. పర్యాటక పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హోళికేరి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇల త్రిపాఠి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, డీఎఫ్వో (DFO) రోహిత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వాచ్ మెన్ దారుణ హత్య

సికింద్రాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :
సికింద్రాబాద్ చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. వాచ్మెన్ ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసారు. ఉప్పర బస్తీలో నిర్మాణంలో ఉన్న భవనములో రామ చంద్రయ్య వాచ్మెన్ గా పనిచేస్తున్నాడు. రెండవ అంతస్తులో రామచంద్రయ్య తలపై రాడ్డుతో దుండగులు కొట్టి చంపారు. భవన యజమాని వేణు మాధవ్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. మృతదేహం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.


# మా గోడు పట్టించుకోండి

## భద్రాచలం విలీన గ్రామాల నేతలు

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా ఏపీలో విలీనమైన గ్రామాలను తిరిగి భద్రాచలంలో కలపాలని స్థానిక నేతలు, ప్రజలు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ఈ మేరకు భద్రాచలం విలీన గ్రామాల నేతలు హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామ పంచాయతీలను తిరిగి భద్రాచలంలోనే విలీనం చేయాలని వారు మంత్రి తుమ్మలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 6వ తేదీన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి భేటీ నేపథ్యంలో విలీన ప్రతిపాదనను వారి ముందు పెట్టాలని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశానని, మరోసారి సీఎం దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్తానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక సమస్యలపై మంత్రికి విలీన గ్రామాల ప్రజలు వివరించారు. భద్రాచలం,చర్ల ప్రధాన రహదారిలో ఆంధ్రప్రదేశ్ పరిధిలోని ఎటపాక ఆర్ అండ్ బీ రోడ్డు దుస్థితిని ఆయనకు వివరించారు. రోడ్డు పరిస్థితి దారుణంగా ఉందని, ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే స్పందించిన మంత్రి ఏపీ ఆర్ అండ్ బీ సీఈతో ఫోన్‌లో మాట్లాడారు. మరమ్మతులు చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని అధికారిని కోరారు. విలీన గ్రామాల రైతులకు రుణమాఫీ విషయంలో ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా చూడాలని మంత్రిని నేతలు కోరగా.. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారికి సూచించారు.

## మంత్రి దామోదర్ రాజనర్సింహ నాగర్ కర్నూల్ జిల్లా పర్యటన

**నాగర్ కర్నూలు, జూలై 5 (ప్రజాస్వరం) :**
రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం నాగర్ కర్నూలు లో పర్యటించారు.



హాజీపూర్ చౌరస్తా వద్ద మంత్రికి నాగర్ కర్నూల్ జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్, జిల్లాకు చెందిన పలువురు వైద్యులు నర్సింగ్ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ జిల్లాలో ఉన్న సమస్యలపై చర్చించారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు డెంగ్యూ మలేరియా విస్తరించకుండా నిర్మూలన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వైద్య అధికారులు, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడారు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## స్పీకర్ అయ్యన్న పాత్రుడు అసెంబ్లీ,సిఆర్డిఏ అధికారులతో సమన్వయ సమావేశం

**అమరావతి, జూలై 5 (ప్రజాస్వరం) :**
ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఎంఎల్ఏ, ఎంఎల్సిల క్వార్టర్లు ఎప్పటి లోగా పూర్తి చేయగలరని సిఆర్డిఏ అధికారులను అసెంబ్లీ స్పీకర్ సిహెచ్.అయ్యన్న పాత్రుడు అడిగారు. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాల్లో సిఆర్డిఏ, అసెంబ్లీ అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఏ,ఎంఎల్సి క్వార్టర్ల భవనాలను ఎప్పటికి పూర్తి చేసి ఇవ్వగలరని అడిగారు. అలాగే అసెంబ్లీ భవనంలో లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు.ప్రస్తుతం మీడియా పాయింట్ ఉన్న ఎనెక్సా భవనంలో లైబ్రరీ,కమిటీ చైర్మెన్ లకు ఛాంబర్లు ఏర్పాటుపై సమీక్షించారు. ఈసమావేశంలో సిఆర్డిఏ కమీషనర్ కాటమనేని భాస్కర్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పిపికె రామాచార్యులు,ఎంఎల్ఏలు, టి.శ్రావణ్ కుమార్, విష్ణు కుమార్ రాజు,ఇతర అధికారులు పాల్గొన్నారు.





# మళ్లీ కూలిన ముత్తారం వంతెన

**కరీంనగర్, జూలై 5 (ప్రజాస్వరం) :**
పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్, భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్ళపల్లి గ్రామాల మధ్య మానేర్ వాగుపై నిర్మిస్తున్న వంతెన మరోసారి కూలింది. వంతెనపై గడ్డర్ల నిర్మాణానికి ఏర్పాటు చేసిన చెక్కలు విరిగిపోయి కిందపడి ముక్కలయ్యాయి. రాత్రిపూట గైడర్లు కూలడంతో ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది.గత ఏప్రిల్ 22న అర్ధరాత్రి ఓడేడ్ వైపు పియర్స్ మధ్య ఏర్పాటు చేసిన గైడర్లు కూలిపోయాయి. ప్రస్తుతం గర్మిళ్లపల్లి వైపు నిర్మించిన 17, 18 పియర్స్ మధ్య ఏర్పాటు చేసిన 5 గైడర్లు కూలిపోయాయి.రెండు జిల్లాల మధ్య రాకపోకలకు మానేరు వాగుపై గత బిఆర్ఎస్ ప్రభుత్వం 49 కోట్లను బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేసింది. 2016 ఆగస్టు నెలలో అప్పటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్ శంకుస్థాపన చేశారు. అనంతరం 2023 –24 లో మరొక 11 కోట్ల నిధులను ఈ వంతెన నిర్మాణానికి అదనంగా కేటాయించారు. వంతెన నిర్మాణం పూర్తయితే రెండు జిల్లాల మధ్య దూరం తగ్గి రవాణాకు అనువుగా ఉంటుంది.అధికారుల నిర్లక్ష్యం పాలకుల పర్యవేక్షణ లోపానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది రెండు జిల్లాల మధ్య నిర్మించే వంతెన. పనులు ప్రారంభించి 8 ఏళ్లు పూర్తి కావస్తున్నా 50% పనులు కూడా పూర్తి కాలేదు. నాణ్యతా లోపంతో పనులు చేపట్టడంతో గత ఏడాది కురిసిన భారీ వర్షం వరదలకు కొంత కూలింది.తర్వాత గత ఏప్రిల్ మాసంలో గాలి వానకి పిల్లర్లపై ఉన్న గైడర్లు కింద పడిపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొద్దిగా వాటర్ వస్తుండగా తుప్పు పట్టిన గైడర్లు కింద పడిపోయాయి. బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తికాకముందే కుప్పకూలుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వంతెన ప్రక్కనే తాత్కాలిక మట్టి రహదారి నిర్మాణం చేసి ఇరువైపులా రాకపోకలు కొనసాగిస్తున్నారు. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మానేరు నదిలో నీటి ప్రవాహం పెరిగి రాత్రి సమయంలో రాకపోకలు తగ్గించారు.భారీగా రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అయిందని స్థానికులు తెలుపుతున్నారు. నిర్మాణం పూర్తికాకముందే నేల కొరుగుతుండడంతో నాణ్యత లోపం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాణ్యత లోపంతో నిర్లక్ష్యంగా బ్రిడ్జి నిర్మిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని పనులు వేగవంతంగా పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# 66 సెల్ ఫోన్ల రికవరీ

**సిద్దిపేట, జూలై 5 (ప్రజాస్వరం) :**



గత కొన్ని రోజుల నుండి పడిపోయిన దొంగలించబడిన 66 ఫోన్లను రికవరీ చేసి సంబంధిత బాధితులకు కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ అనురాధ చేతుల మీదుగా అందజేయడం జరిగింది.సెల్ ఫోన్ ఎక్కడైనా పడిపోయిన, ఎవ్వరైనా దొంగలించకపోయినా వెంటనే సీఈఐఆర్, డాటా నమోదు చేయాలి ఫోన్ రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది.20–ఏప్రిల్– 2023 నుండి 920 సెల్ ఫోన్లు సిఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకుని సంబంధిత బాధితులకు అప్పగించడం జరిగింది.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. ఫోన్ దొరికిన బాధితులు మీ బంధువులలో, మీ గ్రామాలలో మీ స్నేహితులలో ఎవరిదైనా ఫోన్ దొంగతనం జరిగిన ఎక్కడైనా పడిపోయిన వెంటనే పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయాలి అనే విషయం పై వారందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. వరకు జిల్లాలో సీఈఐఆర్ పోర్టల్ 2560 మంది సెల్ఫోన్ పోయినట్లు నమోదు చేసుకున్నారు. అందులో నుండి 920 సెల్ ఫోన్లు రికవరీ చేసి సంబంధిత బాధితులకు అప్పగించడం జరిగింది. మిగతా ఫోన్లు కూడా త్వరలో ట్రేస్ ఔట్ చేసి సంబంధిత బాధితులకు అప్పగించడం జరుగుతుంది.సెల్ఫోన్ పోయిందా.. అయితే టెన్షన్ పడకండి. వెంటనే సీఈఐఆర్ లాగిన్ అయి వివరాలు నమోదు చేసుకుంటే తొందర్లోనే ఫోన్ ఎక్కడుందో కనిపెట్టొచ్చని సిద్దిపేట పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రస్తుత రోజుల్లో చిన్నవాళ్ల నుంచి వృద్ధుల వరకు ప్రతిఒక్కరి జీవితంలో సెల్ఫోన్ ఒక భాగమైపోయింది. ఒక్కోసారి ఫోన్ కనిపించకపోయినా. ఎక్కడైనా పోగొట్టుకున్నా. ఎవరైనా దొంగిలించినా ఆ బాధ వర్ణణాతీతం. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక వెబ్ సైటను అందుబాటులోకి తీసుకొచ్చింది. అదే సీఈఐఆర్, సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్, సెల్ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ వెబ్సైట్ లో పూర్తి వివరాలు నమోదు చేస్తే వీలైనంత తొందరగా దొరికే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కమిషనర్ తెలిపారు.

## సీఈఐఆర్ లో ఎలా నమోదు చేసుకోవాలి..

కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఈ సీఈఐఆర్ అనే పోర్టల్ ద్వారా సెల్ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా వెతికి పట్టుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. సెల్ఫోన్ పోయిన వ్యక్తి ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్ లో ముందుగా ఫిర్యాదు చేయాలి, లేదా మీసేవ కేంద్రానికి వెళ్లి www.ceir.gov.in అనే వెబ్సైట్లో లాగిన్ కావాలి. అందులో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్ , స్టోలెన్ అనే లింకై క్లిక్ చేసి, సెల్ఫోన్ నెంబర్, ఐఎంఈఐ నెంబర్, కంపెనీ పేరు, మోడల్, కొన్న బిల్లు అప్లోడ్ చేయాలి. దీంతో పాటు ఏరోజు, ఎక్కడ పోయింది. రాష్ట్రం, జిల్లా, పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసిన వివరాలు నమోదు చేయాలి. చివరిగా వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపు కార్డు, ఈమెయిల్ ఐడీ, ఓటీపీ కోసం మరో సెల్ఫోన్ నెంబర్ ఇవ్వాలి. ఇదంతా. పూర్తయిన తరువాత ఒక ఐడీ నెంబర్ వస్తుంది. తద్వారా సంబంధిత ఐడీ ఫోన్ స్టేటస్ తెలుసుకోవచ్చు. ఏ కంపెనీ మొబైల్ అయినా సీఈఐఆర్ విధానం 24 గంటల్లోపు ఫోన్ పని చేయకుండా చేస్తుంది. సెల్ఫోన్ దొరికిన తర్వాత వినియోగదారుడు అదే వెబ్సైట్లోకి వెళ్లి అక్ ఫౌండ్ మొబైల్ అనే లింక్ పై క్లిక్ చేసి. ఐడీ నమోదు చేయగానే ఫోన్ అన్ బ్లాక్ అవుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

**సీఈఐఆర్ వెబ్సైట్ పై అవగాహన కార్యక్రమాలు..**
సీఈఐఆర్ సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్, గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం: సెల్ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరికీ సీఐఈఆర్ గురించి తెలిసేలా పోలీస్ స్టేషన్లో, సర్కిల్ పరిధిలో, డివిజన్ పరిధిలో బ్లూ కోర్ట్స్, పెట్రో కార్ సిబ్బందిచే అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని. సెల్ఫోన్ పోయిన వెంటనే తమ పరిధిలోని పోలీసులకు సమాచారం అందించి సీఈ ఐఆర్ అప్లికేషనన్ను సద్వినియోగం చేసుకోవాలని, ఫోను పెద్దదైన చిన్నదైనా అందులో ఉన్న డాటా చాలా ముఖ్యమని ఇప్పుడు ఆన్లైన్ ట్రాన్జక్షన్స్ ప్రతి ఒక్కరు కూడా సెల్ఫోన్ ద్వారానే చేయడం జరుగుతుందన్నారు. ఫోన్ ఎక్కడ పడిపోయినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ లో సీఈఐఆర్ పోర్టల్ లో డాటా ఎంట్రీ చేసుకోవాలని కమిషనర్ ప్రజలకు సూచించారు. పోయిన ఫోను మళ్లీ దొరకదు అనుకున్న ఫోను, పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంబంధిత బాధితులు పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఎస్ఐ నరేందర్ రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది స్వప్న, శ్రీకాంత్, రమేష్, మల్లేశం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీపీగా ప్రణయ్ ప్రయాణం సక్సెస్

- చిన్న వయసులోనే ఎంపీపీగా బాధ్యతలు
- ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న యువనేత
- ప్రజలు, అధికారుల సహకారం మరువలేనిది
- మంచిర్యాల జిల్లా తాండూరు మండలం ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్



**తాండూర్, జూలై 5 (ప్రజాస్వరం) :**
మంచిర్యాల జిల్లా తాండూరు మండల ఎంపీపీగా పూసాల ప్రణయ్ కుమార్ తన పదవీ కాలాన్ని సంపూర్ణంగా పూర్తి చేశారని చెప్పవచ్చు. అతి చిన్న వయసులోనే కాసిపేట గ్రామపంచాయతీ ఎంపీటీసీగా ఎన్నిక కాబడి అనంతరం అప్పటి టిఆర్ఎస్ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆశీస్సులతో ఏకంగా మండల ఎంపీపీగా నియమించబడ్డాడు. అప్పటి వరకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకపోయినప్పటికీ సదరు గ్రామపంచాయతీ ప్రజానీకం ప్రణయ్ కుమార్ కు ఎంపీటీసీగా పట్టం కట్టారు. అనంతరం ఎంపీపీగా పదవి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి సొంత గ్రామపంచాయతీ తోపాటు, ఇతర గ్రామపంచాయతీలను అభివృద్ధి పరచడానికి అహర్నిశలు శ్రమించారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. గతానికి భిన్నంగా యువకుడు కావడం చేత నిత్యం ప్రజల్లో ఉంటూ , అటు సోదరా ఎంపిటిసి లను, ఇతర ప్రజాప్రతినిధులను, పార్టీ నాయకులను సమన్వయ పరుచుకుంటూ అభివృద్ధి చేశారని పలు రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతుంది. మండలంలోని కొంతమంది ప్రజాప్రతినిధుల మధ్య అక్కడక్కడ భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఓర్పుతో వారందరికి సద్ది చెబుతూ సమన్వయ పరిచిన తీరు పలువురుని ఆకట్టుకుంది. తన పదవి కాలం పూర్తయిన సందర్భంగా సదరు యువనేత ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే నాకు ఇంతటి అవకాశాన్ని కల్పించిన ప్రజలకు, అప్పటి ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల ప్రతి ఒక్క అధికారి నాకు సంపూర్ణంగా సహకరించారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఎలాంటి అవిశ్వాసాలకు తావివ్వకుండా, విశ్వాసం గా పని చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. నేను ఎంపీపీగా పదవి బాధ్యతలు చేపట్టిన నాటినుండి శక్తి వంచన లేకుండా పనిచేశానన్నారు. భవిష్యత్తులో ప్రజలు మరో మారు నన్ను ఆశీర్వదించి వారి సేవకు ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నానన్నారు.

# నెక్స్ట్ కృష్ణమోహన్ రెడ్డేనా..?

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :**
తెలంగాణలో అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌లో సీనియర్ నేతలతోపాటు, గెలిచిన ఎమ్మెల్యేలు కూడా అధికార కాంగ్రెస్‌కు క్యూ కడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు గాలం వేస్తున్నారు. బీఆర్ఎస్ శాసన సభాపక్షం కాంగ్రెస్‌లో విలీనమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరారు. తాజాగా బీఆర్ఎస్ సీనియర్ నేత రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు కూడా హస్తం తీర్థం పుచ్చుకున్నారు.కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ మ్మెల్యేల చేరిక దానం నాగేందర్‌తో మొదలైంది. తర్వాత తెల్లాం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్, కాలె యాదయ్య ఇలా ఆరుగురు చేరారు. ఇంకా చాలా మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు క్యూలో ఉన్నారని హస్తం నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నెక్స్ట్ కాంగ్రెస్‌లో చేరే బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎవరన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి క్యూలో ముందు వరుసలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. అయితే జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య అలకతో ఆయన చేరికకు చివరి నిమిషంలో బ్రేక్‌పడింది. ప్రస్తుతం జెడ్పీ చైర్‌పర్సన్ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో కృష్ణమోహన్‌రెడ్డికి లైన్ క్లియర్ అయింది.అన్నీ అనుకున్నట్లు జరిగితే వారం రోజుల్లో కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడతారని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని కాంగ్రెస్ నేతలు కూడా ధ్రువీకరిస్తున్నారు. అయితే పార్టీ మార్పు వార్తలను కృష్ణమోమన్‌రెడ్డి మాత్రం కొట్టిపారేస్తున్నారు. పార్టీ మార్పు విషయంపై ఎమ్మెల్యేను అడగగా.. ప్రజల కోసం పార్టీ మారడానికి సిద్ధమేనని జోగులాంబ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వెల్లడించారు. అభివృద్ధి కోసం పార్టీ మారాలని కార్యకర్తలు అడుగుతున్నారని, త్వరలోనే కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నట్లు ప్రకటించారు. అంతకుముందు కాంగ్రెస్‌లోకి రావాలని మంత్రి జూపల్లి ఆహ్వానించింది నిజమేనని ఎమ్మెల్యే చెప్పారు.కాగా, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని నల్లగుంటలో ఓ కాంగ్రెస్ కార్యకర్త సెల్ టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో గద్వాల జిల్లాలో రాజకీయాలు వేడుక్కుతున్నాయి.బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మొదట టీడీపీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2009లో గద్వాల నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆయన..2014 ఎన్నికల్లోనూ ఓడిపోయారు. ఆ తర్వాత 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల ఎమ్మెల్యేగా గెలుపొందారు.పార్టీ మార్పుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. అయితే ఇప్పటి వరకు కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు ఎమ్మెల్యేలు కూడా తమ చేరికను చివరి నిమిషం వరకు గోప్యంగానే ఉంచారు. ఇప్పుడు కృష్ణమోహన్‌రెడ్డి కూడా అదే ఆలోచనలో ఉన్నారని, అందుకే పార్టీ మార్పు వార్తలను కొట్టిపారేస్తున్నారని తెలుస్తోంది.

# మారని ఉద్యోగుల తీరు..

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :**
తెలంగాణలో పాలనపై రేవంత్ రెడ్డి సర్కార్ తనదైన మార్క్ చూపించాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని వివిధ శాఖల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంత్రులంతా ఆయా శాఖల కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. అయితే మంత్రులు ఆకస్మికంగా తనిఖీలు చేసి ఉద్యోగులకు సర్‌ప్రైజ్ ఇవ్వాలని చూస్తే ఉద్యోగులే మంత్రులకు షాకులు ఇస్తున్నారు. ఆఫీసులకు వెళ్లిన మంత్రులకు ఖాళీ కుర్చీలే కనిపిస్తున్నాయి. అందులో ఉండాల్సిన ఉద్యోగులు మాత్రం తర్వాత తాపీగా వస్తుండటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు సమయానికి రారనే ప్రచారంతో అసలు అధికారులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అనే అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టిన రాష్ట్ర మంత్రులు వరుసగా తనిఖీలు చేస్తూ వారిలో జవాబుదారీతనాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. మంత్రిని చూసి ఉద్యోగులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. నిర్దేశిత సమయానికి కొంత మంది మాత్రమే ఉద్యోగులు హాజరవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఎంత మంది ఉద్యోగులు హాజరయ్యారంటూ అటెండెన్స్ బుక్ చూడాలంటూ సూచించారు. మీకు టైమ్ టేబుల్ ఉండదా..? లేట్‌గా వస్తే అడిగేవారు లేరా..? అని ప్రశ్నించారు.ఉద్యోగులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అసలు డ్యూటీకి హాజరవుతున్నారా..? వారి పనితీరు ఎలా ఉంది అనే దానిపై వరుస తనిఖీలు చేస్తూ ఆరా తీస్తున్నారు. ఉద్యోగులు టైమ్‌కి రాకపోయినా, పని తీరు సరిగ్గా లేకపోయినా నివేదికలు అడుగుతున్నారు. కొన్నిసార్లు అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు నిర్లక్ష్యం వహించే ఉద్యోగులకు భయం పుట్టేలా ఈ తనిఖీలు జరుగుతున్నాయని తెలిసింది. ఇక నుంచి తప్పకుండా అందరూ ఉద్యోగులు సమయానికి విధి నిర్వహణకు హాజరవ్వాలని ఆదేశించారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చించారు.వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగులు, ఇతర సిబ్బంది విధులకు నిర్దేశిత సమయానికి హాజకాకపోవడంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపికి మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. కాగా, బుధవారం ఆర్ అండ్ బీ సెక్షన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆర్ అండ్ బీ విభాగంలో ఖాళీ కుర్చీలే దర్శనమివ్వడంతో షాక్ తిన్నారు. ఇక తుమ్మలకు ఇలాంటి వాతావరణం కనిపించడంతో అధికారులపై సీరియస్ అయ్యారు.

# గంగుల మౌనం ఎందుకో..

- సైలెంట్ అయిన గంగుల
- బీఆర్ ఎస్ కార్యక్రమాలకు దూరంగా..
- పార్టీ మారుతున్నారేమో అన్న అనుమానాలు
- బిఆర్ఎస్ ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన గంగుల
- మనసులో ఏముందో అని బీఆర్ ఎస్ పార్టీ శ్రేణుల్లో అనుమానాలు



**కరీంనగర్, జూలై 5 (ప్రజాస్వరం) :**
మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఎప్పుడూ దూకుడుగా ఉంటారు. స్వపక్షం అయినా, విపక్షం అయినా హడావిడి చేస్తుంటారు. కానీ బీఅర్ఎస్ అధికారం దిగిపోయాక గంగుల సైలెంట్ అయ్యారు. బీఅర్ఎస్ ఇచ్చిన నిరసన కార్యక్రమాలలో కూడా దూరంగా ఉంటున్నారు. పార్టీ అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నా అంత దూకుడుగా కనిపించడం లేదు. మరి గంగుల కమలాకర్ మనసులో ఏముంది. అయన ఎలాంటి స్టెప్పుతో ముందుకు వెళ్తారనే చర్చ జోరుగా సాగుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ బలమైన నేత, బీసీ వర్గాల్లో మంచి పట్టున్న నేత, ఇప్పటి వరకు ఓటమి చెందకుండా వరుసగావిజయం సాధిస్తున్నారు. అంతే కాకుండా బీఅర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఅర్ కు అత్యంత సన్నిహితుడు. ఈ పదేళ్ళలలో ప్రభుత్వంలో, పార్టీలో అన్నీ తానై నడిపించారు. 2009లో టిడిపి విజయం సాధించిన తరువాత 2014 ఎన్నికల కంటే ముందు బీఅర్ఎస్ లో చేరారు. 2014, 2018, 2023 లో మొత్తం నాలుగుసార్లు కరీంనగర్ నుండి విజయం సాధించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలో బీఅర్ఎస్ ఓడిన తరువాత కమలాకర్ సైలెంట్ అయ్యారు. పూర్తిగా హడవుడి తగ్గించారు.పార్లమెంటు ఎన్నికల్లో కుడా అంత దూకుడు ప్రదర్శించలేదు. నియోజకవర్గంలోని చేపట్టిన ఏ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. ఒకవేళ కరీంనగగర్ లో ఉన్నప్పటికీ ఇంటికే పరిమితం అవుతున్నారు. ఎప్పుడూ మీడియాలో యాక్టివ్ గా కనబడే కమలాకర్ ఇప్పుడు మీడియాకి దూరంగా ఉంటున్నారు. బిఅర్ఎస్ లో ఉన్నప్పటికీ పార్టీ నేతలతో చురుగ్గా కలిసి చర్చించడం లేదు. ఈ విషయాన్ని కార్యకర్తలు కూడా చర్చించుకుంటున్నారు. అయితే కమలాకర్ మనసులో ఎముందో ఎవరికి అర్థం కావటం లేదు. సీఎం రేవంత్ రెడ్డి.. కమలాకర్ గతంలో టిడిపిలో కలిసి పనిచేశారు. వీరిద్దరి మధ్య మంచి రిలేషన్ ఉంది. ప్రభుత్వం పైన కూడా ఎలాంటి విమర్శలు చేయడం లేదు ఎమ్మెల్యే కమలాకర్. ఎప్పుడూ దూకుడుగా ఉండే కమలాకర్ ఇప్పుడు మౌనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పార్టీ మార్పు పైనా ఇప్పటికే తన అనుచరులకి సంకేతాలు ఇచ్చారని కొన్ని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే తాను పార్టీలోనే ఉంటానని, బిఅర్ఎస్ ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే కరీంనగర్ జిల్లాలోని కొందరు బీఅర్ఎస్ కార్పోరేటర్లు ముఖ్య నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. జిల్లాలో వివిధ సమస్యలపైన బీఅర్ఎస్ ఘాటుగా విమర్శలు చేస్తుంటే.. మాజీ మంత్రి మాత్రం సైలెంట్ అయిపోయారు. దీంతో ఆయన మనసులో ఏముందో అన్న అభిప్రాయాన్ని పలువురు పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

# తలసాని జంపేనా...

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :**
ఎర్రవల్లి ఫాం హౌస్ లో బుజ్జగింపుల పరంపర కొనసాగుతునే ఉంది. మధ్యలో మూడు రోజులు బ్రేక్ తీసుకున్న కేసీఆర్ మళ్లీ పార్టీ నేతలను బుజ్జగించడం మొదలుపెట్టారు. గపార్టీ వీడొద్దంటూ ఉన్నటువంటి ఎమ్మెల్యేలను , జడ్పీ చైర్మన్‌లను బతిమలాడుతున్నారు. ఆ క్రమంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సేనని.. ఈ సారి 15 ఏళ్లు అధికారంలో ఉంటామని వారికి భరోసా ఇస్తుండటం విశేషం. అయితే ఆ మాటల మాంత్రికుడు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా.. ఎమ్మెల్యేలతో పాటుఇతర నేతలు కారు దిగేందుకు సిద్ధం అవుతున్నారంట.అధికారంలో ఉన్నప్పుడు నియంతలా వ్యవహరించిన మాజీ సీఎం కేసీఆర్‌ను పవర్ పోయాక చోటుచేసుకుంటున్న పరిణామాలు బాగా టెన్షన్ పెడుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఒక పక్క ఆయన హయాంలో జరిగిన అవకతవకలపై విచారణలు.. మరోవైపు వలసపోతున్న నేతలతో పార్టీ ఖాళీ అవుతుండటంతో ఆయన తెగ హైరానా పడిపోతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా ప్రతినిధులను ప్రగతి భవన్ మెట్లు తొక్కనివ్వని కేసీఆర్.. వారినితానే స్వయంగా ఫోన్లు చేసి ఫాం హౌస్ కు పిలిపించుకొని బతిమిలాడుకుంటున్నారు. 10 రోజుల నుండి పార్టీ ప్రజా ప్రతినిధులను ఫాంహౌస్‌కు పిలిపించుకుంటున్న ఆయన మధ్యలో మూడు రోజులు బ్రేక్ తీసుకుని మళ్లీ ఆ ప్రోగ్రాం షురూ చేశారు.ఇప్పటికే కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలకు ఫోన్లు చేసి, ఫాంహౌస్‌కు పిలిపించుకుని తెగ బుజ్జగించారు. వారికి కూడా ఫ్యూచర్ మనదేనని భరోసా ఇచ్చారు. ఆయన అలా



భరోసా ఇచ్చి అంతలా బతిమిలాడిన ఎమ్మెల్యేలు పార్టీలో కొనసాగుతున్నారా అంటే అదీ లేదు. చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్యను ఇలానే ఫాంహౌస్‌కు పిలిపించుకుని బుజ్జగించారు. మరుసటి రోజే యాదయ్య ఢిల్లీ వెళ్లి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. యాదయ్య పార్టీ మార్పుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కౌంట్ 39 నుంచి 32కి పడిపోయింది.ఎమ్మెల్యేలను బుజ్జగించిన ఫలితం లేకపోతుండటంతో.. కేసీఆర్ మిగిలిన నాయకులనైనా కాపాడుకోవడానికి తాపత్రయపడుతున్నారు. తాజాగా బీఆర్ఎస్ జడ్పీ చైర్మన్లను కేసీఆర్ ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు పిలిపించుకుని మీటింగ్ పెట్టారు.. వారిని కుటుంబసమేతంగా ఆహ్వానించి విందు కూడా ఇచ్చారు. తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ ఈసారి మళ్ళీ అధికారంలోకి వచ్చి.. ఈ సారి 15 ఏళ్ళు అధికారంలో ఉంటుందని వారికి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. పనిలోపనిగా కాంగ్రెస్ ప్రభుత్వంపై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బీఆర్ఎస్.. నెలన్నర క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో దారుణాతిదారుణంగా ఓడిపోయింది. ఆ విషయం ఎవరికీ తెలియదన్నట్లు.. ఆయన 15 ఏళ్ల అధికారం చెప్తుండటంపై ఫాంహౌస్‌కి వెళ్లి వచ్చిన నేతలే సెటైర్లు విసురుతున్నారు.ఉన్న ఎమ్మెల్యేలను కాపడుకోలేని కేసీఆర్.. అధికారంలోకి వస్తే 15 ఏళ్లు అధికారంలో ఉంటామని చెపుతుండటం హాస్యాస్పదంగా ఉందని పార్టీ నేతలే చిర్రుబుర్రులాడుతున్నారు. ఇప్పటికే 6 గురు ఎమ్మెల్యేలు హస్తం గూటికి వచ్చారు. రానున్న రోజుల్లో మరి కొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతారన్న టాక్ వినిపిస్తుంది. జులై 24 నుండి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనుండటంతో..ఈ లోపే గ్రేటర్ హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు ఉండే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పెద్దల నుంచి గ్రీన్ సిగ్నల్ కూడా తీసుకున్నారంట.ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేరిక దాదాపుగా ఖాయమైందంట. మొన్నటి వరకు సైలెంట్ గా ఉన్న మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇప్పుడు అంతే సైలెంట్‌గా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు పావులు కదుపుతున్నారంట. అందుకోసం ఇండియా కూటమిలో కీలకంగా ఉన్న అఖిలేష్ యాదవ్ తో మంతనాలు జరుపుతున్నారంట. తలసాని ప్రయత్నాలు ఫలిస్తే.. గ్రేటర్ లో కారు ఖాళీ అవ్వడం ఖాయంగా కనిపిస్తుంది.

# 1:50 అంటున్న టీఎస్పీఎస్సీ...

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :**
తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు అభ్యర్థులను 1:100 నిష్పత్తిలో ఎంపికచేయాలంటూ ఒకపక్క నిరుద్యోగులు డిమాండ్లు చేస్తుంటే.. పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాత్రం తగ్గేదేలే అంటోంది. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి 1:50 నిష్పత్తిలోనే 'గ్రూప్-1' మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ప్రకటించింది. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ప్రతిభ ఆధారంగా మెయిన్స్ పరీక్షకు సాధారణ పరిపాలనశాఖ జారీచేసిన ఉత్తర్వుల(జీవో నెం. 55, 29)లోని నిబంధనల ప్రకారం 1:50 నిష్పత్తిలోనే ఎంపిక చేస్తామని స్పష్టం చేసింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు అభ్యర్థుల ఎంపికపై హైకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా.. వారి అభ్యర్థనలను పరిశీలించిన టీజీపీఎస్సీ మెయిన్స్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపికచేయడం సాధ్యం కాదని తెలిపింది. ఈ మేరకు అభ్యర్థుల అభ్యర్థనలను తిరస్కరిస్తున్నట్లు వెల్లడిస్తూ ఇటీవల టీజీపీఎస్సీ మెమో జారీచేసింది. 'గ్రూప్-1' ప్రిలిమినరీ పరీక్షలో మెరిట్ ఆధారంగా మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని ఇటీవల కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం.. అభ్యర్థుల అభ్యర్థనలను పరిశీలించాలని కమిషన్‌కు సూచించింది. చట్టానికి లోబడి వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని, ఆ నిర్ణయాన్ని అభ్యర్థులకు తెలియజేయాలని కమిషన్‌ను ఆదేశించింది. ఈ మేరకు అభ్యర్థుల అభ్యర్థనలను పరిశీలించిన టీజీపీఎస్సీ.. వాటిని తిరస్కరిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు హైకోర్టులో మెమో దాఖలు చేసింది. అయితే దీనిపై నిరుద్యోగుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి.

**అభ్యర్థనల తిరస్కరణకు కమిషన్ చెప్పిన కారణాలు ఇవీ..**

- ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖ జారీ చేసిన 'జీవో నెం.55'ను సవరణ చేస్తూ 'జీవో నం.29' జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ జీవోలోని నిబంధనలకు అనుగుణంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక ఉంటుందని గ్రూప్-1 నోటిఫికేషన్ జారీ అయింది.
- గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక విషయం జీవో నెం.29లోని పేరా నం.5లో స్పష్టంగా ఉంది.
- ప్రతి మల్టీజోన్‌లో ఖాళీల సంఖ్యకు అనుగుణంగా 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.
- తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీసు రూల్స్ - 1996లోని 22, 22ఏ నిబంధనల మేరకు సంబంధిత రిజర్వుడ్ కేటగిరీల్లో అభ్యర్థుల సంఖ్య తక్కువైతే, అందుకు అనుగుణంగా ఆ కేటగిరీల నుంచి అదనంగా అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది.
- ప్రధాన పరీక్షకు అభ్యర్థుల ఎంపికపై ఉద్యోగ ప్రకటన నం.02/2024లోని పేజి నం.16లోని పేరా 12 లోని పేరా బీ లోనూ 1:50 నిష్పత్తిలో ఎంపికపై స్పష్టంగా పేర్కొన్నారు.
- ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖ జారీ చేసిన 'జీవో నెం.55'ను సవరణ చేస్తూ 'జీవో నం.29' జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ జీవోలోని నిబంధనలకు అనుగుణంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక ఉంటుందని గ్రూప్-1 నోటిఫికేషన్ జారీ అయింది.
- గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక విషయం జీవో నెం.29లోని పేరా నం.5లో స్పష్టంగా ఉంది.
- ప్రతి మల్టీజోన్‌లో ఖాళీల సంఖ్యకు అనుగుణంగా 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.
- తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీసు రూల్స్ -1996లోని 22, 22ఏ నిబంధనల మేరకు సంబంధిత రిజర్వుడ్ కేటగిరీల్లో అభ్యర్థుల సంఖ్య తక్కువైతే, అందుకు అనుగుణంగా ఆ కేటగిరీల నుంచి అదనంగా అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలకు లోబడి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు విడుదల చేసి, ఖాళీలను భర్తీ చేస్తుంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల అభ్యర్థనలను పరిశీలించిన తరువాత వాటిని తిరస్కరిస్తున్నట్లు టీజీపీఎస్సీ స్పష్టం చేసింది

# గంజాయి కలకలం

**కడప, జూలై 5 (ప్రజాస్వరం) :**
కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గంజాయి గుప్పుమంది. ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ ముగ్గురు విద్యార్థులు కలిసి కడప లో ఒక వ్యక్తి దగ్గర కొన్నట్లు సమాచారం. క్యాంపస్ సెక్యూరిటీ చెకింగ్ లో నాలుగు గ్రాముల గంజాయి దొరికినట్లు సమాచారం. ట్రిపుల్ ఐటీ అడ్మిషన్ ల టైం కావడంతో అధికారులు సమాచారం గోప్యంగా ఉంచారు. పోలీసులు ఘటన పై గోప్యంగా విచారణ చేపట్టారు.

## మంత్రి నారాయణను కలిసిన

# కలెక్టర్ ఆనంద్

**మంత్రికి పుష్పగుచ్ఛం అందచేసిన కలెక్టర్**
**జిల్లా అభివృద్ధిపై ఇరువురు చర్చ**

**నెల్లూరు, జూలై 5 (ప్రజాస్వరం) :**
నెల్లూరు జిల్లా నూతన కలెక్టర్గా ఓ ఆనంద్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ని కలెక్టర్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణ కి పుష్పగుచ్ఛం అందచేశారు. అనంతరం జిల్లా అభివృద్ధి అంశాలపై ఇరువురు చర్చించారు.

# రెచ్చిపోయిన ఫ్రెండ్లీ పోలీసులు

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :**
సైదాబాద్ పోలీసు స్టేషన్లో పోలీసుల దాష్టీకం వెలుగులోకి వచ్చింది. తనకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫిర్యాదు దారుడినే పోలీసులు చితకబాదారు. రాంసింగ్ అనే చిరు వ్యాపారిని ఎస్సె సాయి కృష్ణ కానిస్టేబుళ్లు విచక్షణా రహితంగా కొట్టారు. సింగరేణి కాలనీకి రాంసింగ్ భార్య రెండు నెలల క్రితం ఇంటి పక్కన వాళ్లతో గొడవ జరిగింది.అదే రాత్రి ఆమె మృతి చెందింది.తన భార్య మృతికి ఇంటి పక్క వాళ్లే కారణమంటూ పిర్యాదు చేశారు. ఈ కేసు లో సాధారణ మృతిగా పోస్టుమార్టం నివేదిక వచ్చింది. దాని కోసం భర్త రాంసింగ్ బుధవారం రాత్రి సైదాబాద్ పీఎస్ కు వెళ్ళాడు. అతడిని చూసిన ఎస్ ఐ సాయి కృష్ణ అతడిని రూంలోకి తీసుకు వెళ్లి లైట్లు అపి వేసి ఇతర సిబ్బందితో దుర్భాష లాడుతూ చితకబాదారు .విషయం తెలుసుకున్న బాధితుడు కుటుంబ సభ్యులు పీఎస్ కు పెద్ద ఎత్తున్న రావడంతో తో పోలీసులు సర్ది చెప్పి పంపించారు. బాధితుడిని ఉస్మానియా ఆసుపత్రి కి తరలించి చికిత్స చేయించారు.న్యాయం చేయాలంటూ బాధితుడు వేడుకుంటున్నారు.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

**కాకినాడ, జూలై 5 (ప్రజాస్వరం) :**
వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై కేసు నమోదైంది. ఏ1గా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి,ఏ2గా బళ్ల సూరిబాబు, మరో 24 మందిపై కాకినాడ రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 2న కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని రాజ్యలక్ష్మీనగర్‌లో వైసీపీ నేత సూరిబాబుకు చెందిన అక్రమ కట్టడం కూల్చివేత ఘటనలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారని వీరందరిపై అధికారులు ఫిర్యాదు చేశారు.

# పెద్ద అంబర్ పేట ఔటర్ రింగ్ రోడ్డు వద్ద పోలీసుల కాల్పులు

**నల్గొండ, జూలై 5 (ప్రజాస్వరం) :**
కరడు కట్టిన పార్ధీ ముఠా ఓ వ్యాన్లో ప్రయాణిస్తున్న విషయం తెలుసుకున్న నల్గొండ పోలీసులు వాళ్లను పట్టుకునేందుకు మాటు వేసారు. పోలీసులను చూసిన ముఠా సభ్యులు ఒక్క సారిగా పోలీసులపై దాడికి ప్రయత్నించారు.దాంతో పోలీసులు వారిపై కాల్పులు జరిపారు. కొంతమంది పార్ధ ముఠా సభ్యులు పారిపోగా నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

## తెలంగాణ ప్రభుత్వానికి ఎన్ హెచ్ ఆర్సీ నోటీసులు

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :**
నేషనల్ హ్యూమన్ రైట్స్ కమీషన్ (ఎన్ హెచ్ ఆర్సీ) తెలంగాణ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శికి నోటీసులిచ్చింది. మౌలిక సదుపాయాల కల్పన మీద తీసుకుంటున్న చర్యల మీద 4 వారాల్లో వివరణ ఇవ్వాలని ఎన్ హెచ్ ఆర్సీ ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పన మీద నివేదిక ఇవ్వాలని కోరింది. ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ , మౌలిక సదుపాయాలు విద్యా ప్రమాణాలు బాగాలేవని ఎన్ హెచ్ ఆర్సీ కి కార్పొరేటర్ శ్రవణ్ కంప్లైంట్ చేసారు.

# జడ్జిలనూ బ్లాక్ మెయిలింగ్ ?

- ఒకప్పుడు స్వపక్షం, విపక్షం తేడా లేకుండా ఫోన్ ట్యాపింగ్
- ప్రస్తుతం న్యాయమూర్తులకూ తప్పడం లేదు
- మీడియా కథనాలు రావడంతో న్యాయశాఖ అప్రమత్తం
- సుమోటోగా స్వీకరించిన హైకోర్టు
- కేసు వివరాలు అందించాలని ఆదేశం
- అఫిడవిట్ సమర్పించిన పోలీసులు



**గల్లీ లీడర్ల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు, విపక్ష నేతలు, వారి కుటుంబ సభ్యులు, అనుచరులు.. ఇలా స్వపక్షం, విపక్షం.. మీ, మా అనే తేడా లేకుండా అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరి ఫోన్‌ను ట్యాప్ చేసేశారు. అయితే ఇప్పుడీ లిస్ట్‌లో న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులు కూడా ఉన్నట్టు లేటెస్ట్‌గా తేలింది.**

**హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :**
న్యాయవ్యవస్థ.. ఇది రాజ్యాంగబద్ధంగా నడిచే ఓ ఇండిపెండెంట్ వ్యవస్థ.. ఇందులో ఎవరి ఇన్‌వాల్వ్‌మెంట్ ఉండదు.. ఎలాంటి పక్షపాతాలు ఉండవు. కానీ ఇందులో కూడా వేలు పెట్టి వ్యవస్థలను తమకు అనుకూలంగా మార్చుకున్నారు బీఆర్ఎస్ పెద్దలు.. ఇది మేం చెప్పడం లేదు.. పోలీసులు హైకోర్టు ధర్మాసనానికి సమర్పించిన అఫిడవిట్‌లో ఉన్న సంచలన విషయాలు. కేసులను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఏకంగా కోర్టులను కూడా ప్రభావితం చేశారు. దీనికి ఎగ్జాంపుల్ జస్టిస్ కాజా శరత్, ఆయన భార్య ఫోన్లు కూడా ట్యాప్ చేశారు.వారిద్దరు మాత్రమే కాదు హైకోర్టు జడ్జిలు, ప్రభుత్వానికి సంబంధించిన కేసులను వాదిస్తున్న న్యాయవాదులను కూడా వదల్లేదు. ఈ వివరాలు చెప్పింది ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ3గా ఉన్న నాయిని భుజంగరావు చెప్పిన విషయాలు.. అంటే బీఆర్ఎస్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడిన ప్రతిసారి వారి వ్యక్తిగత విషయాలను తెలుసుకొని.. వారిని బ్లాక్ మెయిల్ చేసి బెదిరించడం.. పరిస్థితులను, వ్యవస్థలను తమకు అనుకూలంగా మలుచుకున్నారని తేలిపోయింది. జడ్జిల కదలికలు, వ్యక్తిగత విషయాలపై ఎప్పటికప్పుడు ఆరా తీశారు. వారి వ్యక్తిగత జీవితంలో ఏదైనా తప్పు జరిగితే దాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలన్నది గత ప్రభుత్వ పెద్ద ఆలోచన అని తేలిపోయింది. అందుకే జడ్జిల కుటుంబ సభ్యుల ఎక్కడి వెళ్తున్నారు? ఎవరిని కలుస్తున్నారు? ఏం మాట్లాడుతున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టు తీర్పులు రాకూడదనే జడ్జిలను కూడా టార్గెట్ చేశారన్నది అర్థమవుతోంది. ఆర్టీసీ ఉద్యోగుల బంద్, ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మహత్యలు బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాయి. హైకోర్టు కూడా ఈ కేసుల విషయంలో గత ప్రభుత్వాన్ని తప్పు పట్టింది. ఇలాంటి కేసుల్లో ముందు ముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు వస్తే భవిష్యత్‌లో ప్రజల్లో వ్యతిరేకత పెరిగే అవకాశం ఉంది. అందుకే న్యాయమూర్తుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారన్నది మనకు అర్థమవుతున్న విషయం.. అంటే ఎక్కడా తమకు వ్యతిరేకత అనేది బయటికి రాకూడదు. ఇదే ఆలోచన కనిపిస్తోంది ఈ ట్యాపింగ్ వ్యవహారం వెనక.సీఎం రేవంత్ రెడ్డి నుంచి మొదలు పెడితే.. ముఖ్యమైన నేతలు, వారి అనుచరులు, డ్రైవర్లు.. ఆఖరికి గన్‌మెన్లు కూడా ఉన్నారు అందులో.. ఇంతా వీని వీరు ప్రజలకు ఏమైనా పనికొచ్చే పనులు చేశారా? అంటే అదీ లేదు. కమీషన్లు వసూలు చేయడం.. బీఆర్ఎస్ పార్టీకి డోనేషన్లు ఇచ్చేలా చేయడం.. ఇదే సాగింది పదేళ్లపాటు.. ఈ విషయాలన్ని బయటికి రావడానికి అసలు కారణం ఏంటంటే.. లెటెస్ట్‌గా మీడియాలో ఫోన్ ట్యాపింగ్ కేసులో జడ్జిలు కూడా బాధితులుగా ఉన్నారన్న కథనాలు వచ్చాయి. దీనిని సుమోటోగా తీసుకున్న హైకోర్టు.. కేసు వివరాలన్నింటిని తమకు అందించాలని ఆదేశించింది. దీంతో పోలీసులు అఫిడవిట్ సమర్పించారు. ఇప్పటికే రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు మాత్రమే ఉన్నారనుకున్న ఈ కేసులో.. బాధితులుగా న్యాయవ్యవస్థకు చెందిన వారు కూడా ఉన్నారని తేలింది.

# గువ్వల చెరువు టన్నెల్ నిర్మాణానికి నిధులు

### మంజూరు చేయడంపై హర్షనీయం

### వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి



**అన్నమయ్య, జూలై 5 (ప్రజాస్వరం) :**
గువ్వల చెరువు టన్నెల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం హర్షణీయమని వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎంతో కాలం నుండి ఎదురు చూస్తున్న గువ్వల చెరువు ఘాట్ టన్నెల్ నిర్మాణానికి 2024-2025 సంవత్సర ప్లాన్ లో రూ వెయ్యి కోట్ల నిధులతో అప్రూవల్ కావడం హర్షణీయమన్నారు. 2021 వ సంవత్సరంలో ఎంపీ మిథున్ రెడ్డి, తాను కలసి ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలసి నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. ఇందుకు వెంటనే స్పందించిన నితిన్ గడ్కరీ గువ్వల చెరువు టన్నెల్ ఫైలును పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. 2022 వ సంవత్సరంలో సర్వే చేయించారన్నారు. 2023 వ సంవత్సరంలో టెండర్ పిలవడం జరిగిందన్నారు. సర్వే ప్రకారం 6 కిమీ రోడ్డు ఉన్న రోడ్డులో ఇరువైపులా అప్రోచ్ రోడ్డు ,దాదాపు 2.50 కిమీ మేర టన్నెల్ వుంటుందన్నారు.కడప రోడ్డులోని సుగాలి బిడికి నుంచి ఘాట్ లోని ఆఖరి మలుపులో జాయిన్ అవుతుందన్నారు.ఈ డిసెంబర్ లోగా ఖచ్చితంగా టెండర్ పిలుస్తారని ఎన్ హెచ్ అధికారుల ద్వారా తెలుసుకున్నామన్నారు. టన్నెల్ నిర్మాణానికి సహకరించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ఈ టన్నెల్ నిర్మాణం త్వరితగతిన పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగవడమే కాకుండా, ప్రమాదాలు చాలా వరకు తగ్గి, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం చాలా వరకు తగ్గుతుందన్నారు. ఈ టన్నెల్ నిర్మాణం ఈ ప్రాంత వాసులకు మంచి శుభవార్త అని అన్నారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ అధికారులుకు కృతజ్ఞతలు తెలుపుచూ, టన్నెల్ నిర్మాణ పనులుకు సంబంధించి టెండర్ పక్రియను త్వరితగతిన పూర్తిచేసి, త్వరగా పనులును ప్రారంభించాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు.

# 2 కోట్లు భవనం.. 12 కోట్లా

### బావ కళ్లలో ఆనందం కోసం

**కడప, జూలై 5 (ప్రజాస్వరం) :**
వడ్డించేవాడు మనవాడైతే కడ పంక్తి లో ఉన్నా.. పంచభక్ష పరమాన్నాలు దక్కుతాయి. అందుకే వైసిపి ఏలుబడిలో అస్మదీయులకు వ్యవస్థలను కట్టబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. కడపలో అయితే చేసిందే చట్టం, చెప్పిందే న్యాయం అన్నట్టు వ్యవహారాలు నడిచాయి. పులివెందులలో అవినాష్ రెడ్డి సొంత బావ ఓ వెంచర్ వేసి బిల్డింగ్ కట్టడం ప్రారంభించారు. కనీసం రెండు కోట్ల రూపాయల కూడా చేయని బిల్డింగ్ ను.. రూ.12 కోట్లు ఇచ్చి కొనుగోలు చేసింది పర్యాటక శాఖ. అంటే ఒకరోజు ఒప్పందంతో అవినాష్ రెడ్డి బావకు చేకూర్చిన ఆదాయం అక్షరాల 10 కోట్ల రూపాయలు.వైసీపీ నేతగా చలామణి అవుతున్న అవినాష్ రెడ్డి బావ పులివెందులలో ఎకరానార స్థలంలో ఒక వెంచర్ వేశారు. అక్కడ స్థలం విలువ అంతంత మాత్రమే. అక్కడ వేసిన పిల్లర్లు, స్లాబ్ ఖర్చు రెండు కోట్లు కూడా చేయదు. వాస్తవానికి ఆ ప్రాంతంలో కొనుగోలు చేసేవారు కూడా తక్కువే. కనీసం అద్దెకు ఉండేందుకు కూడా ఎవరూ ముందుకు రారు. అక్కడ బిల్డింగ్ కట్టడంతో అంతా ఆశ్చర్యంగా చూశారు. కానీ అక్కడే ఒక ట్విస్ట్ ఉంది. ఇలా నిర్మాణంలో ఉన్న భవనాన్ని ఏకంగా పర్యాటక శాఖతో కొనుగోలు చేయించారు అప్పటి కలెక్టర్. పులివెందులలో ఫోర్ స్టార్ హోటల్ కట్టేందుకు సగం కట్టిన భవనం రెడీగా ఉందని.. రెండున్నర ఎకరాల్లో ఉందని కడప జిల్లా కలెక్టర్ పర్యాటక శాఖకు ప్రత్యేక రిక్వెస్ట్ చేశారు. అదే సమయంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో పర్యాటక శాఖ అధికారులు రూ.12.50 కోట్లు చెల్లించి కొనుగోలు చేశారు.ఏకంగా అవినాష్ బావ ఖాతాలో పదిన్నర కోట్ల రూపాయల ఆదాయం చేరిపోయింది.వాస్తవానికి అక్కడ భవనం కట్టింది ఎకరం నర స్థలంలోనే. అయితే కలెక్టర్ మాత్రం రెండున్నర ఎకరాల్లో ఉందని చెప్పడం విశేషం. అంతస్థలం లేకున్నా ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆదేశాలు రావడంతో పర్యాటక శాఖ అధికారులు కొనేశారు. పన్నుల రూపంలో ప్రజల నుంచి సేకరించిన ఈ ఆదాయాన్ని గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు ఎలా పంచుకున్నారు ఈ ఘటన తెలియజేస్తోంది. ఇలాంటివి ఎన్నెన్నో ఉన్నాయి. ఖజానా అంటే తమ సొంత సొమ్ముగా భావించి.. వైసీపీ పాలకులు పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ దారుణాలు బయటపడుతున్నాయి. అయితే దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందా? లేదా? అన్నది చూడాలి.

### బస్సు, కంటైనర్ ఢీ..

# బస్సు డ్రైవర్ మృతి

**చిలకలూరిపేట, జూలై 5 (ప్రజాస్వరం) :**
చిలకలూరిపేట ఆర్టీసీ డిపో ఎదురుగా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. డిపో ఎదురుగా ఆర్టీసీ బస్సు లారీని ఢీకొంది.ఘటపలో అక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. నరసరావుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కంటైనర్ ఢీకొంది. ప్రమాదంలో బస్సు డ్రైవర్అద్దాలలో నుంచి ముందుకు దూసుకొచ్చి, కంటైనర్ కిందపడి డ్రైవర్ మృతి చెందాడు. బస్సులో ఉన్న నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని హాస్పిటల్ కి తరలించారు.

# కాల్చేసిన పేపర్ల లెక్కేంటీ...

**విజయవాడ, జూలై 5 (ప్రజాస్వరం) :**
నిన్న సీఐడీ, నేడు ఏపీ ఖనిజాభివృద్ధి, పొల్యూషన్ నియంత్రణ మండలికి సంబంధించిన పేపర్స్ వంతైంది. మరి రేపు ఏ శాఖ అన్నది ఆసక్తికరంగా మారింది.విజయవాడ- అవనిగడ్డ కరకట్టపై బుధవారం రాత్రి ప్రభుత్వానికి సంబంధించిన కీలక పత్రాలను గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. కొన్ని పేపర్స్‌ను గమనించిన చుట్టు పక్కల వాళ్లు కొన్ని ఫైళ్లపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఫోటోలు కనిపించాయి. అలాగే కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థలకు చెందిన బస్తాల కొద్దీ పేపర్లను తగలబెట్టడం కలకలం రేపుతోంది.బుధవారం రాత్రి 9 గంటల సమయంలో కొంతమంది వ్యక్తులు ఇన్నోవా కారులో కరకట్టపైకి వచ్చారు. కారుపై ప్రభుత్వ వాహనం అనే స్టిక్కర్ ఉంది. పెనమలూరు మండలం పెదపులిపాక సమీపంలో బస్తాల్లోని దస్త్రాలను తగలపెట్టారు. అటువైపు వెళ్తున్న కొంతమంది వాటిని గమనించారు. దస్త్రాలపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి, కాలుష్య మండలి మాజీ ఛైర్మన్ సమీర్‌శర్మ ఫోటోలు కనిపించాయి.ఈ విషయం తెలియగానే స్థానిక టీడీపీ నేతలు అక్కడికి చేరుకుని కారులో వచ్చినవారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. యనమలకుదురులో టీడీపీ నేతలు ఆ వాహనాన్ని అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అధికారుల సూచనతోనే పేపర్స్ తీసుకొచ్చి తగలబెట్టినట్టు కారు డ్రైవర్ నాగరాజు చెబుతున్న మాట.రెండు విభాగాలకు చెందిన పేపర్లను రాత్రివేళ సీక్రెట్‌గా తగల బెట్టాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? దీని వెనుక అధికారుల పాత్ర ఉందా? పేపర్స్ కీలకమైనవి కాకపోతే.. అమరావతి పరిసర ప్రాంతాల్లో ఎందుకు తగలబెట్టలేదు? ఇవే ప్రశ్నలు రైజ్ అవుతున్నాయి. ఇవేకాదు గతంలో సిట్ దర్యాప్తు చేసిన పత్రాలను ఇలాగే తగలబెట్టారు. అప్పటి వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు రావడంతో చివరకు అధికారులు క్లారిఫికేషన్ ఇచ్చుకున్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని పెదపులిపాక వద్ద నిర్మానుష్యం ప్రదేశంలో బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కారులో వచ్చిన దుండగులు కరకట్టపై బస్తాల్లోని దస్త్రాలను తగలబెట్టడం మొదలుపెట్టారు. ఈ వాహనంపై ప్రభుత్వ వాహనం అనే స్టిక్కర్ ఉంది. అక్కడే ఉన్న స్థానికులు ఏం తగలబెడుతున్నారని ప్రశ్నించారు. అవి ప్రభుత్వ దస్త్రాలని గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాటిపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిఫోటోలు ఉండటంతో ఆ దస్త్రాలు తీసుకొచ్చిన కారు డ్రైవర్‌ను వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అవన్నీ పొల్యుషన్ కంట్రోల్ బోర్డుకు సంబంధించిన దస్త్రాలని డ్రైవర్ తెలిపాడు. అటుగా వెళ్తున్న ఓ టీడీపీ కార్యకర్త దీన్ని గమనించి.. దస్త్రాలపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి, పీసీబీ మాజీ ఛైర్మన్ సమీర్ శర్మ చిత్రాలు ఉండడంతో వెంటనే విషయాన్ని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నేతలకు సమాచారం ఇచ్చారు.కాలుష్య నియంత్రణ మండలి , ఏపీ ఖనిజాభివృద్ధిసంస్థలకు చెందిన బస్తాల కొద్దీ దస్త్రాలను దగ్ధం చేశారు. వీటిల్లో కొన్ని హార్డ్ డిస్కులు, సీఎంవోకు చెందిన పత్రాలు సైతం ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. పరారయ్యేందుకు యత్నించగా పట్టుకున్న డ్రైవర్ నాగరాజును గట్టిగా నిలదీయడంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ సమీర్‌శర్మ సూచనలతోనే ఈ ఫైళ్లు తగులబెట్టినట్లు అంగీకరించాడు. అయితే, దగ్ధం చేసిన ఫైళ్లలో కీలక సమాచారం ఉందని టీడీపీ నేతలు చెబుతున్నారు. గతంలో పెద్దిరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్రంలో విలువైన ఖనిజ సంపద దోపిడీకి గురైందని విమర్శించారు. ఇసుక తవ్వకాలపై సీఎం సమీక్ష నిర్వహించిన మరుసటి రోజే కీలక దస్త్రాలు తగులబెట్టడం అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు.

**వారి పాత్రపై చర్చ..**
మరోవైపు, దస్త్రాల దహనం ఘటనకు సంబంధించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ ఛైర్మన్ సమీర్ శర్మ, ఓఎస్డీ రామారావు పాత్ర ఉందంటూ ఎక్సైజ్ శాఖ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు ఓఎస్డీ రామారావును విచారణకు పిలిచారు. ఎక్సైజ్ శాఖలో రామారావు సుదీర్ఘ కాలం పని చేశారు. కొత్త ప్రభుత్వంలో ముఖ్యులకు తాను ఓఎస్డీగా వెళ్తున్నట్లు కొంతకాలంగా ఆయన అందరితో చెప్పుకొంటున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ సహా మరికొందరు మంత్రులకు తాను సన్నిహితుడినని ప్రచారం చేసుకుంటున్నట్లు అంతటా చర్చ సాగుతోంది. ఎక్సైజ్ శాఖలో ఉద్యోగుల బదిలీలు, ఆర్వోఆర్ విషయాల్లో అక్రమాలకు తెర లేపారనే ఆరోపణలు ఉన్నాయి.

### విచారణకు ఆదేశం..



కృష్ణా కరకట్టపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రికార్డుల దగ్ధం చేసిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దగ్ధం చేసిన ఫైల్స్, రిపోర్టులకు సంబంధించిన వివరాలను వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. దీని వెనుక ఎవరున్నారనే అంశాలపై ఆరా తీసిన ఆయన.. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. 'అసలు పీసీబీ కార్యాలయాల్లో ఫైల్స్, రిపోర్టులు ఏ మేరకు భద్రంగా ఉన్నాయి. భద్రపరిచేందుకు అనుసరిస్తోన్న విధానాలు ఏంటో వెల్లడించాలి.' అని అధికారులకు నిర్దేశించారు. మరోవైపు, ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణకు ఆదేశించింది. రికార్డుల దగ్ధం ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. కాగితాలతో పాటు కంప్యూటర్ హార్డ్ డిస్కులు, గుర్తింపు కార్డులు కూడా ఉండడంపై సీరియస్ అయ్యింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# 15 రోజులు ఏడు వంతెనలు

**పాట్నా, జూలై 5 (ప్రజాస్వరం) :**



ఏదైనా నిర్మాణం చేపడితే పది కాలాలపాటు మన్నికగా ఉండాలనుకుంటాం. నిర్మాణ సంస్థలు కూడా ఈమేరకు ప్రమాణాలు పాటిస్తూ కట్టడాల నిర్మాణం చేపడతాయి. నిర్మాణ సమయంలోనూ క్వాలిటీని పరిశీలిస్తుంటారు. ఒక ఇంటి నిర్మాణం సమయంలోనే అనేక జాగ్రత్తలు తీసుకుంటాం. ఇక ప్రజల కోసం ప్రభుత్వాలు చేపట్టే నిర్మాణాల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలి. కానీ బిహార్‌లో అలాంటి ప్రమాణాలు పటించినట్లు కనిపించడం లేదు. అందుకే ఆ రాష్ట్రంలో నిర్మిస్తున్న వంతెనటు పుట్టపుట్ట కూలిపోతున్నాయి. వరుసగా కూలిపోతున్న వంతెనలను చూస్తుంటే అవి బలమైన నిర్మాణాలా లేక పేకమేడలా అన్న సందేహం కలుగుతోంది.బిహార్ రాష్ట్రంలో గడిచిన 15 రోజుల వ్యవధిలో ఏడు వంతెనలు కుప్పకూలాయి. తాజాగా సివాన్ జిల్లా డియోరియా ప్రాంతంలో గండక్ నదిపై చిన్న వంతెన నిర్మాంచారు. దీనికి కొన్ని రోజులుగా మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం(జూలై 3న) కొంత భాగం కూలిపోయింది. పది రోజుల క్రితం ఇదే జిల్లాలో ఓ వంతెన కుప్పకూలింది. పది రోజుల్లో రెండు వంతెనలు కూలిపోయాయి. తాజాగా కూలిన వంతెన 1982-83 మధ్య నిర్మించారు. ప్రమాదానికి కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.ఇక ఇటీవల బిహార్ రాష్ట్రంలోని కిషన్‌గంజ్ జిల్లాలో కంకయీ నదిపై నిర్మించిన ఓ వంఎతన కుంగిపోయింది. దీంతో బహదుర్‌గంజ్, దిఘాల్ బ్యాంక్ బ్లాక్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అంతకు ముందు తూర్పు చంపారన్, సివాన్, ఆరారియా జిల్లాల్లో వంతెనలు కూలిపోయాయి. ఇలా గడిచిన 15 రోజుల్లోనే 7 వంతెనలు కూలిపోవడం గమనార్హం. వరుస ఘటనలతో వంతెనల నాణ్యతపై ఆందోళన వ్యక్తమవుతోంది.ఇక.. ఇప్పటి వరకు కూలిన వంతెనలు మొత్తం.. ఎవరూ లేని సమయంలో వాహనాలు వెళ్తున్న సమయంలో కూలిపోలేదు. కానీ, అవే వంతెనలు ప్రయాణికులు ఉన్న బస్సులు, పిల్లలు ఉన్న స్కూల్ బస్సులు వెళ్తున్న సమయంలో జరిగితే తీవ్ర ప్రాణ నష్టం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి వంతెనల నాణ్యతను పరిశీలించాలని బిహార్ ప్రజలు కోరుతున్నారు.

# చంద్రబాబు ఒక్కరే భేటీయేనా...

**న్యూఢిల్లీ, జూలై 5 (ప్రజాస్వరం) :**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. రాష్ట్ర అభివృద్ధి కోసమే ఆయన ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులను వరసగా కలుస్తున్నారు. కేవలం నిధులను అత్యధికంగా సమీకరించే దిశగానే చంద్రబాబు హస్తిన పర్యటన పెట్టుకున్నారు. ఆయన నిన్ననే ఢిల్లీకి చేరుకున్నారు. ప్రధానితో పాటు కేంద్ర మంత్రులను కలసి రాష్ట్రానికి మరిన్ని నిధులు వచ్చేలా సహకరించాలని కోరుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది. కానీ జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను వెంట తీసుకెళ్లకపోవడంపై ఇప్పుడు జనసేనలో హాట్ టాపిక్ గా మారింది. పవన్ ను కూడా వెంట తీసుకెళితే మరింత బలంగా ఉండేదన్న కామెంట్స్ సోషల్ మీడియాలో పెడుతున్నారు.పొరుగు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కూడా తీసుకెళుతున్నారు. ప్రధానిని కలిసినా, కేంద్రమంత్రులతో భేటీ అయినా రేవంత్ రెడ్డి వెంట మల్లు భట్టి విక్రమార్క ఉంటారు. ఇక పార్టీ అగ్ర నేతలను కలసినప్పుడు కూడా ఆయన తన వెంటే డిప్యూటీ సీఎంను అంటి పెట్టుకుని వెళతారు. పార్టీ పెద్దలను కలసినప్పుడు సరే.. కానీ ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసేటప్పుడు డిప్యూటీ సీఎంను తీసుకెళ్లడం అంటే అది ఒక గౌరవం ఇచ్చినట్లవుతుందంటారు. ఆయనకు కూడా పాలనలో భాగస్వామ్యం ఇవ్వడమే కాకుండా ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందని రేవంత్ రెడ్డి భావిస్తారు. కానీ ఆంధ్రప్రదేశ్ విషయానికి వచ్చేసరికి చంద్రబాబు ఒక్కరే ఢిల్లీకి వెళ్లడాన్ని జనసేన నాయకులు తప్పుపడుతున్నారు. పవన్ కల్యాణ్ కు ఈ విషయంలో ఎలాంటి అసంతృప్తి లేకపోయినా జనసైనికుల్లో మాత్రం ఈ ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. పవన్ కల్యాణ్ ను ఢిల్లీ తీసుకెళితే మోదీ, కేంద్ర మంత్రుల వద్ద మరింత బలంగా ఉండి, రాష్ట్రానికి అత్యధికంగా నిధులు, ప్రయోజనం చేకూరుతుంది కదా? అని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల పింఛన్ల పంపిణీలో లబ్దిదారులకు అందచేసిన కరపత్రాలలోనూ పవన్ కల్యాణ్ ఫొటో లేకపోవడంపై జనసైనికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పవన్ ను కావాలని సైడ్ చేస్తున్నారా? లేదా అనుకోకుండా జరుగుతుందా? అని పార్టీ అగ్రనేతలను ఆరా తీస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ వల్లనే కూటమి ఏర్పాటు సాధ్యమయిందన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. పవన్ గట్టిగా పట్టుబట్టి పోకుండా ఉండి ఉంటే కూటమి ఏర్పాటు సాధ్యమయ్యేది కాదని, రాజమండ్రి జైలు బయట చేసిన ప్రకటన నుంచి పొత్తులు కుదిరే వరకూ పవన్ చేసిన కృషిని మర్చిపోయారా? అంటూ జనసైనికులు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తర్వాత స్థానం పవన్ కల్యాణ్ కు ఇవ్వాల్సిందేనని, సమ ప్రాధాన్యత ఇస్తేనే తమకు తృప్తిగా ఉంటుందని కూడా కొందరు కామెంట్స్ పోస్టు చేస్తున్నారు. అయితే పవన్ ను ఆహ్వానిస్తే ఆయన తాను ఢిల్లీకి ఇప్పుడు రాలేనని చెప్పారా? లేక మామూలుగానే చంద్రబాబు పర్యటన చేపట్టారా? అన్న విషయంలో పార్టీ అగ్రనేతలే క్లారిటీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటి వరకూ జనసైనికుల్లో అసంతృప్తి బయటపడుతూనే ఉంటుంది.

# టీడీపీ గూటికి వైసీపీ ఎమ్మెల్యేలు

**గుంటూరు, జూలై 5 (ప్రజాస్వరం) :**
వైసీపీ ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పార్టీని వీడుతారా? టిడిపిలో చేరతారా? అనర్హత వేటు పడకుండా మండలిలోని వైసీపీ పక్షాన్ని టిడిపిలో విలీనం చేస్తారా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. వైసిపికి ఘోర పరాజయం ఎదురు కావడంతో.. పార్టీ మారడం మేలన్న నిర్ణయానికి మెజారిటీ ఎమ్మెల్సీలు వచ్చినట్లు తెలుస్తోంది. దీనిపైనే అధినేత జగన్ ఆందోళనతో ఉన్నట్లు సమాచారం.పార్టీ నేతలతో సమీక్షలో జగన్ సైతం ఇదే ప్రస్తావన తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీల కదలికలు, ఎవరెవరు వెళ్లే అవకాశం ఉంది అన్నదానిపై చర్చించినట్లు సమాచారం.మండలిలో 57 మంది ఎమ్మెల్సీలకు గాను.. దాదాపు 38 మంది వరకు వైసిపి సభ్యులు ఉన్నారు. జగన్ ఓడిపోయినా మండలిలో బలం చూసుకుని సత్తా చాటాలని చూశారు. అధికారపక్షం దూకుడుకుచెక్ చెప్పాలని భావించారు. కూటమి ప్రభుత్వానికి ఇరుకున పెట్టాలని చూశారు. అమరావతి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి కీలక బిల్లులను కూటమి సర్కార్ తీసుకురానుంది. వీటికి శాసనమండలిలో వైసిపి అడ్డు తగలడం ఖాయం. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ బిల్లులను వ్యతిరేకిస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని వైసీపీ ఎమ్మెల్సీలు భయపడుతున్నారు. మరోవైపు పార్టీ పరిస్థితి ఏమంత ఆశాజనకంగా లేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. చాలామంది సీనియర్లు ఆ పార్టీలో చేరే అవకాశం ఉంది. అందుకే ఎమ్మెల్సీలు సైతం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అయితే చాలామంది ఎమ్మెల్సీలు గడప దాటేందుకు సిద్ధపడినట్లు సమాచారం.ఇది వైసీపీ శ్రేణుల్లో కలవరపాటుకు గురి చేసే అంశం.ఇప్పటికే ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన చాలామంది ఎమ్మెల్సీలపై అనర్హత వేటు పడింది. మండలి చైర్మన్ మోషేన్ రాజు వైసీపీకి చెందిన నేత. ఆయన ద్వారా తతంగాన్ని నడిపించారు. జగన్ నమ్మకం కూడా అదే. మండలి చైర్మన్ ద్వారా వైసిపి బలాన్ని నిరూపించుకోవాలని చూశారు. కానీ మెజారిటీ ఎమ్మెల్సీలు అలా భావించడం లేదు. అవసరమైతే ఒకేసారిగా టిడిపిలోకి ఫిరాయించేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. అనర్హత వేటు పడకుండా మండలిలో వైసీపీని టిడిపిలో విలీనం చేసేందుకు కూడా కొంతమంది యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలామంది ఎమ్మెల్సీలు టిడిపి నేతలకు టచ్‌లోకి వచ్చినట్లు తెలుస్తోంది. కీలక బిల్లులకు మోక్షం కలగాలంటే ఇప్పుడు మండలిలో ఆమోదం అవసరం. అందుకే టిడిపి సైతం మండలి విషయంలో సీరియస్ గా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే జగన్ సైతం ఆందోళన పడుతున్నారు. బెంగళూరు నుంచి తాడేపల్లి కి వచ్చిన జగన్ క్యాంపు కార్యాలయంలో పార్టీ సీనియర్లతో సమావేశమయ్యారు. వైసీపీ ఎమ్మెల్సీలు చాలామంది పార్టీ మారే అవకాశం ఉందని అధినేత అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎటువంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు జగన్ చెప్పినట్లు తెలుస్తోంది.

# జగన్ కు నితీష్ అస్త్రం

**ఒంగోలు, జూలై 5 (ప్రజాస్వరం) :**



వైఎస్ జగన్ కి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత పరిస్థితులు తలకిందులయ్యాయి. 151 సీట్ల నుంచి ఒక్కసారిగా 11 సీట్లకు పడిపోవడంతోపాటు వైసీపీ అధినేత జగన్ తీవ్ర నిరాశలో మునిగిపోయారు. అసెంబ్లీలో కేవలం 11 సీట్లే రావడంతో ప్రతిపక్ష హోదా కల్పించమని అర్థించవలసి వచ్చింది. అది కూడా తనను ద్వేషిస్తున్నాడు, తన చావునే కోరుకున్నాడని చెప్పుకునే అయ్యన్నపాత్రుడుకి లేఖ రాయడం జగన్‌కు ఇబ్బందికరంగా మారింది. అయినా ప్రతిపక్ష హోదా వస్తుందన్న నమ్మకం లేదు. మొన్నటిదాకా సిద్ధం సభల్లో నేను అభిమన్యుణ్ని కాదు అర్జునుడిని అని జగన్ చెప్పుకున్నప్పటికీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత చంద్రబాబు తన వ్యూహాలతో జగన్‌ని పద్మ వ్యూహంలోకి నెట్టేశారన్న సైటైర్లు వినిపిస్తున్నారు. ఆ విధంగా నువ్వు అర్జునుడివి కాదు.. అభిమన్యుడివే అని చంద్రబాబు చెప్పకనే చెప్పారు. టీడీపీకి 16 మంది ఎంపీలుంటే, నాక్కూడా రాజ్యసభ 11, లోక్‌సభలో 4 కలిపి 15 మంది ఎంపీలున్నారని జగన్ పైకి చెప్పుకుంటున్నప్పటికీ బీజేపీ నుంచి ఆశించిన మద్దతు మాత్రం లభించడం లేదు. ఎన్డీఏలో టీడీపీ భాగస్వామిగా ఉన్నా, జగన్ మాత్రం స్పీకర్ ఎన్నికల్లో బీజేపీకే తన మద్దతు ప్రకటించారు. ఇన్ని చేసినా జగన్ కోరుకున్న జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కేంద్రం కల్పించలేదు.బీహార్ సీఎం నితీశ్ కుమార్ రూపంలో ఆయనకు ఒకదారి దొరికింది. బీహార్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని నితీశ్ డిమాండ్ చేయడంతో జగన్‌కి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టయింది. టీడీపీని ఎదుర్కోవడానికి సరైన సమయంలో సరైన అస్త్రం దొరికినట్టయింది వైసీపీకి. ఏపీకి సంబంధించి పోలవరం, ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి అంశాల్లో ఎలాంటి ప్రకటన చేయకపోయినా బీజేపీతో జట్టు కట్టిన చంద్రబాబు, భారీ విజయం తర్వాత కన్వినియంట్‌గా డిమాండ్‌లు పక్కనపెట్టేసి అమరావతి మీద పూర్తిగా ఫోకస్ చేస్తాడని అందరూ అనుకున్నారు. కానీ నితీశ్ కుమార్ బీహార్ కు ప్రత్యేక హోదా డిమాండ్ చేయడంతో బాబు కూడా ఇరుకునపడినట్టయింది.తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాన్ బెనర్జీ వాషింగ్ పౌడర్ నిర్మా స్కీమ్‌లో భాగంగా ఎన్డీఏలో చేర్చుకుని చంద్రబాబుపై కేసులని మాఫీ చేశారని బీజేపీపై చేసిన ఆరోపణలు సభలో ఉన్న టీడీపీ ఎంపీలను ఇరకాటంలో పడేశాయి. ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి కూడా ప్రత్యేక హోదా అడగడం లేదని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చంద్రబాబును దోషిగా నిలబెట్టేందుకు జగన్ వ్యూహ రచన చేసే అవకాశం లేకపోలేదు. నితీశ్ చేసిన పని బాబుని ఇరకాటంలోకి నెట్టేసింది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక సంక్షోభంతో పాటు తనపై ఉన్న కేసుల నేపథ్యంలో చంద్రబాబు సైతం గట్టిగా ప్రశ్నించలేదు. ఇది రాజకీయంగా చంద్రబాబుకి గడ్డు పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉంది. చూడబోతుంటే రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయం మొత్తం ప్రత్యేక హోదా చుట్టూనే తిరుగుతుందని అనుకోవచ్చు.

# స్క్రూటినీ తర్వాతే చేరికలు..

## కమలం ఆచి తూచి అడుగులు

**విజయవాడ, జూలై 5 (ప్రజాస్వరం) :**
ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఇతర పార్టీల నుండి చేరికలు పైన భారతీయ జనతా పార్టీ ఫోకస్ పెట్టింది. ఎన్నికల ముందు అన్ని పార్టీలో భారీ ఎత్తున చేరికలు జరిగిన విషయం తెలిసిందే. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పుడు ఆ లెక్కలు మారాయి. గతంలో మాదిరి ఎవర్ని పడితే వారిని ఇష్టానుసారంగా జాయిన్ చేసుకునేందుకు బీజేపీ సిద్ధంగా లేదు. ఇకపై జాయిన్ అయ్యే వారి విషయంలో స్క్రూటినీ చేయనుంది. ఇందుకు సంబంధించి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో కమిటీలు వేసేందుకు సిద్ధమవుతుంది ఏపీ బీజేపీ.రాజకీయాల్లో ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీలోకి చేరికలు సర్వసాధారణం. ఎన్నికల ముందు ఎన్నికల తర్వాత పార్టీ ఫిరాయింపులు, చేరికలు జరుగుతుంటాయి. వ్యక్తుల బట్టి, నియోజక వర్గం బట్టి ఈ చేరికల్లో ప్రాధాన్యత ఉంటుంది. చిన్న చితక లీడర్ల జాయినింగ్ విషయాన్ని పార్టీలు పెద్దగా పట్టించుకోకున్నా, బడా లీడర్లు కండువా మార్చుకుంటున్నప్పుడు మాత్రం తప్పకుండా దృష్టి పెడతారు. ఇక రాబోయే రోజులు ఇది మరింత కఠిన తరం కానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కూటమిలో ఉన్న నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి కాషాయ కండువా కప్పుకునే వారి విషయంలో కీలకంగా వ్యవహరించాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోందట. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో ఉన్న ప్రజా ప్రతినిధులు అధికారులు కొత్త ప్రభుత్వంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. అందులో భాగంగానే ప్రజాప్రతినిధులు అధికార భాగస్వామ్యంలో ఉన్న పార్టీలో చేరి వారిని వారు రక్షించుకునే ప్రయత్నాలు చేస్తారు. ఇక గత ఐదేళ్ల ఏపీ రాజకీయాలు దేశంలోనే సంచలనంగా మారాయి. టీడీపీ, వైసీపీ మధ్య రాజకీయ రణరంగం నడిచింది. ఇందులో పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించగా, బీజేపీ పొత్తుతో తిరుగులేని విధంగా ఏపిలో ఎన్డీయే కుటమి ప్రభంజనాన్ని సృష్టించింది. దాంతో ఇప్పుడు కొంతమంది ప్రజాప్రతినిధుల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. గత ఐదేళ్లు వైసీపీ విధ్వంసకండను సృష్టించిందంటూ మండిపడుతున్న కూటమి నేతలు, రాబోయే రోజుల్లో మాజీ ప్రజా ప్రతినిధు పై ఏ రకంగా వ్యవహరిస్తుందని అందర్నీ హడలెత్తిస్తోంది. దాంతో ఎవరికి వారు కూటమి ప్రభుత్వంలో జాయిన్ అయ్యేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారట. ఇలాంటి వారిపై దృష్టి పెట్టిన బీజేపీ కూటమిలో ఉన్న టీడీపీ, జనసేనకు మధ్య ఎలాంటి సమన్వయ లోపం రాకుండా అతి తూచి వ్యవహరిస్తోంది. భవిష్యత్తులో కలిసి పరస్పర సహకారంతో ముందుకు వెళ్లేందుకు నిర్ణయాలు తీసుకుంటుందట. గతంలో ఈ రెండు పార్టీలో ఉండి వైసీపీలోకి వెళ్లి, తిరిగి మళ్ళీ కూటమి ప్రభుత్వంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న వారు గానీ, వైసీపీ నుంచి బీజేపీలోకి వచ్చేవాళ్ళు ఇలా ఎవరినైనా సరే ఇకపై స్క్రూటినీ చేయనున్నారట. గతంలో వీరిపైన ఉన్న ఆరోపణలు ఏంటి..? ఎందుకని ఇప్పుడు పార్టీ మారుతున్నారు లాంటి అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే వారిని పార్టీలో జాయిన్ చేసుకోవాలో వొద్దో ఒక నిర్ణయానికి రానున్నారట.గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడి, కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల విచారణల నుండి బయటపడడానికి ప్రస్తుత ప్రభుత్వంలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలతో పాటు వారిని జాయిన్ చేసుకోవడం వల్ల కూటమిలో ఉన్న పార్టీలకు ఇబ్బంది కలగకుండా నిర్ణయం తీసుకోనున్నారట. వేసిన కమిటీల ప్రకారం చిన్న లీడర్ల అయితే మండల స్థాయి కమిటీలు జిల్లా స్థాయి చర్చించి నిర్ణయాలు తీసుకుంటాయట. ఒకవేళ పెద్ద లీడర్ అయితే రాష్ట్ర స్థాయి కమిటీలు ఆ జాయినింగ్ కు సంబంధించి పూర్తి స్క్రూటినీ చేసిన తర్వాత కూటమి ప్రభుత్వానికి ఇబ్బంది లేకుండా ఉండేటట్లయితేనే బీజేపీ కండువా కప్పుకునేందుకు ఒప్పుకుంటుందట. దీనికి సంబంధించి త్వరలోనే కమిటీ వేసేందుకు సిద్ధం అవుతుంది ఏపీ బీజేపీ. దాంతో రాబోయే రోజుల్లో కాషాయ కండువా కప్పుకోవాలంటే స్క్రూటినీ తప్పనిసరట..!

# నడిరోడ్డులో యువకుడు వీరంగం

## మద్యం మత్తులో హల్చల్

**రంగారెడ్డి, జూలై 5 (ప్రజాస్వరం) :**
బాలాపూర్ కు చెందిన భాగ్య నగర్ రైతు సేవ సహకార సంఘం డైరెక్టర్ పెద్ద నరసింహారెడ్డి కొడుకు జస్వంత్ రెడ్డి మద్యం మత్తులో ఒక యువకుని చితకబాదిన వైనం ఇది. వాహనం పై ఎమ్మెల్యే స్టిక్కర్,సైరన్ వేస్తూ పట్టపగలే రోడ్డుపై అందరూ చూస్తూనే విచక్షణ కోల్పోయి దాడికి తెగబడ్డారు. బూతులు తిడుతూ,రెండుసార్లు సాయి కుమార్ పై దాడికి తెగబడ్డారు దీంతో రోడ్డు పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడ్డది. రోడ్డు పై వెళ్లేవారు చెప్పిన వినకుండా దాడికి దిగారు. బాధితుడు మీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.

# టార్గెట్.. వైసీపీ సీనియర్ నేతలు

- అంతా చట్టబద్ధమే
- రెడ్ బుక్ చూపించి ఎవర్నీ వదలమన్న నారా లోకేష్
- మూలాలన్నీ జగన్ వద్దే ఉన్నాయని చెబుతున్న టీడీపీ శ్రేణులు
- వైసీపీ నేతలను శిక్షించేందుకు పక్కా ప్రణాళిక
- నెలరోజుల పరిణామాలను బట్టీ రాజకీయ వర్గాల్లో చర్చలు

**తెలుగుదేశం పార్టీ గెలిచిన మరుక్షణం వైఎస్ఆర్‌సీపీ నేతలకు కౌంట్ డౌన్ స్టార్ట్ అవుతుందని ఎన్నికలకు ముందు టీడీపీ నేతలు గర్జించేవారు. నారా లోకేష్ అయితే రెడ్ బుక్ చూపించి ఎవర్నీ వదిలే ప్రసక్తే లేదని చెప్పేవారు. ఇలా చెప్పినందుకు ఆయనపై సీఐడీ కేసు కూడా నమోదు చేసింది. ఆయనను అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోర్టును కూడా కోరింది. ఇక ఇతర నేతలు, ద్వితీయ శ్రేణి నేతల ఆవేశం గురించి చెప్పాల్సిన పని లేదు.**



**విజయవాడ, జూలై 5 (ప్రజాస్వరం) :**
కూటమికి మెజార్టీ వచ్చిన మరుక్షణం విరుచుకుపడతారని అనుకున్నారు. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చి నెల రోజులు గడుస్తున్నా పెద్దగా ఏమీ జరగలేదు. గ్రామ స్థాయిలో జరిగే చిన్న చిన్న గొడవలే బయట పడుతున్నాయి. నిజంగా టీడీపీ టార్గెట్ చేసుకున్న ఏ ఒక్క నేత కూడా ఇబ్బంది పడలేదు. కొడాలి నాని దగ్గర్నుంచి రోజా వరకూ అందరూ నింపాదిగానే రాజకీయాలు చేసుకుంటున్నారు. అందుకే టీడీపీ కార్యకర్తల్లో రెడ్ బుక్ ఏమియందన్న ప్రశ్న వస్తోంది. కానీ అంతర్గతంగా మాత్రం వైసీపీ ముఖ్య నేతలందర్నీ చట్టబద్ధంగా ఫిక్స్ చేసేందుకు క్రమబద్ధంగా ప్రక్రియ పూర్తి చేస్తున్నారన్న సమాచారం మాత్రం మెల్లగా బయటకు వస్తోంది. ఏపీలో ఎన్నికల కౌంటింగ్ జరిగిన తర్వాత రోజు నుంచే కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయక ముందే ఏపీ బేవరెజెస్ కార్పొరేషన్ మొత్తాన్ని గుప్పిట్లో పెట్టుకున్న అధికారి వాసుదేవరెడ్డి ఇంట్లో సోదాలు ప్రారంభించారు. ఆయన తనను అరెస్టు చేస్తారేమోనన్న భయంతో హైకోర్టు ను ఆశ్రయించారు. కానీ ఊరట దక్కలేదు. కానీ సీఐడీ అధికారులు వాసుదేవరెడ్డిని అరెస్టు చేయలేదు. కానీ సోదాలు మాత్రం కొనసాగిస్తున్నారు. ఆయనపై రికార్డుల తస్కరణ కేసు పెట్టారు. ఈ విషయంలో వాసుదేవరెడ్డి ఏపీ ప్రభుత్వం టార్గెట్ కాదు. ఆయన ఇచ్చింది తీసుకుని పై వాళ్లు చెప్పినట్లుగా చేశారు. ఆ పైవాళ్లనే సీఐడీ టార్గెట్ చేసింది. అందుకే మొత్తం గుట్టు రట్టు చేస్తున్నారు. విషయం బయటకు రాకుండా అసలు ఏం జరిగిందో లెక్కలతో సహా వెలుగులోకి తెస్తున్నారు. ఇప్పటికే మద్యం విషయంలో జరిగిన భారీ స్కాం విషయంలో అన్ని ఆధారాలను సేకరించారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. జగన్ అధికారంలోకి రావడంతోనే పాలసీ మార్చేశారు. ప్రభుత్వ దుకాణాలు పెట్టారు. అందులో వైసీపీ నేతల డిస్టిలరీల్లో తయారయ్యే విచిత్రమైన బ్రాండ్లే అమ్మారు. అదీ కూడా నగదుకే అమ్మారు. ఈ వ్యవహారంలో అసలు గూడుపుఠాణి మొత్తంబయటకు వచ్చేసిందని అంటున్నారు.అలాగే ఇసుక వ్యవహారంలో కూడా సంచనలనాత్మక స్కాం ఉందని అంటున్నారు. ఇసుక పేరుతో ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం రాకుండానే .. ప్రైవేటు కంపెనీలు ఇసుకను దోపిడీ చేసేలా అనుమతి ఇచ్చారు. వారు కూడా పూర్తిగా నగదు లావాదేవీలే నిర్వహించారు. ఈ మూలాలన్ని నేరుగా జగన్మోహన్ రెడ్డి దగ్గరే ఉన్నాయని టీడీపీ నేతలు చెబుతున్నారు. హడావుడి చేయకుండా ఆధారాల సేకరణ పూర్తి చేయగానే కేసులు నమోదవడం ఖాయమని చెబుతున్నారు. గనుల మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్వాకాలపై టీడీపీ పూర్తి సమాచారం సేకరించింది. గనుల సీవరేజీ దగ్గర నుంచి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వేసుకోవడం వరకూ చాలా అక్రమాలు వెలుగులోకి వచ్చాయని చెబుతున్నారు. గనుల శాఖలో అంతా ప్రైవేటు ఉద్యోగులే ఐదేళ్లు చక్రం తిప్పారని అంటున్నారు. టీడీపీ నేతల గనుల్ని లాక్కుని వైసీపీ నేతలకు అప్పగించడం కోసం.. తప్పుడు నివేదికలు ఇచ్చి వందల కోట్ల జరిమానాలు విధించిన రికార్డు ఉంది. అలాగే నేపాల్‌లో పట్టుబడిన ఎర్రచందనం పెద్దిరెడ్డికి చెందినదని తేలిందని పర్యావరణ మంత్రి పవన్ కల్యాణ్ నేరుగా వెల్లడించారు. ఇది సంచలనం అయింది. ఎర్రచందనం స్మగ్లింగ్ విషయంలో పెద్దిరెడ్డి పేరు నేరుగా డిప్యూటీ సీఎం పవన్ చెప్పినా.. ఆయన వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదంటనే వారు నిజంగా ఇరుక్కుపోయారన్న క్లారిటీ వచ్చిందని టీడీపీ నేతలంటున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాను మంత్రి పదవిలో ఉండి టీడీపీని తీవ్ర స్థాయిలో టార్గెట్ చేశారు. కుప్పం మున్సిపాలిటీలో టీడీపీని అనుచిత పద్ధతుల్లో ఓడించారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పం, హిందూపురంలో వందల కోట్లు ఖర్చు చేసి టీడీపీని ఓడించడానికి ప్రయత్నించారని అంటున్నారు.

అలాగే టీడీపీ నేతలపై కేసులు పెట్టడం.. వేధించడం.. చంద్రబాబుపై రాళ్ల దాడిలోనూ ఆయన కుట్ర ఉందని అనుమానిస్తున్నారు. అందుకే పక్కాగా చట్ట బద్ధంగా కేసుల వల రెడీ అయిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.సీనియర్ మంత్రిగా జగన్ ప్రభుత్వం లో చక్రం తిప్పిన బొత్స సత్యానారాయణ .. బదిలీలకు లంచం తీసుకున్నారన్న దగ్గర నుంచి విద్యాకానుక కిట్ల వరకూ అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రోజా తిరుమల దర్శన టిక్కెట్ల దందా దగ్గర నుంచి రుషికొండ ప్యాలెస్ వరకూ అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తాజాగా పులివెందులలో అసలు ఏ మాత్రం విలువ చేయని వైసీపీ నేత భవనాన్ని పన్నెండున్నర కోట్లు పెట్టి కొన్నారన్న ఆరోపణ దుమారం రేపుతోంది. ఇక ఆడుదాం ఆంధ్రా పేరుతో వంద కోట్ల స్కాం చేశారని ఇప్పటికే ఫిర్యాదులు విచారణాధికారుల వద్దకు వెళ్లాయి. వైసీపీ అదికారంలో ఉన్నప్పుడు టీడీపీ నేతలు, కార్యాలయాలపై జరిగిన దాడులకు లెక్కే లేదు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై 2021లో దాడి జరిగితే కేసులు పెట్టలేదు. ఇప్పుడు పోలీసులు రంగంలోకి దిగారు. అప్పటి సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు. ఈ కేసులో ఐదుగుర్ని అరెస్ట్ చేశారు. నిందితులను పట్టుకోవడంతోపాటు దాడికి పురిగొల్పిన నేతలపైనా చర్యలకు సిద్ధమవుతోంది ప్రభుత్వం. నిందితుల్లో ఎక్కువ మంది మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ అనుచరులు ఉన్నారు. ఈ దాడి వెనకు సూత్రధారులు వాళ్లేనని .. నిందితుల ద్వారా చెప్పించే అవకాశాలు ఉన్నాయి. నిందితులను పట్టుకోవడంతోపాటు ఈ ముగ్గురిపైనా ఏమైనా చర్యలు తీసుకుంటారా? అన్న టెన్షన్ వైసీపీలో కనిపిస్తోంది. ఇక కాకినాడలో ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్ హత్య కేసును ప్రభుత్వం పునర్విచారించాలని భావిస్తోంది. ఈ కేసులో అనంతబాబుతోపాటు మరికొందరి ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. అదేవిధంగా విశాఖలో డాక్టర్ సుధాకర్ కేసును మళ్లీ ఓపెన్ చేస్తున్నారు. సుధాకర్ ఎపిసోడ్‌లో భూ సంబంధ వ్యవహారాలు ఉన్నాయనే సమాచారం ప్రభుత్వానికి చేరడంతో అంతర్గత విచారణ ముమ్మరంగా సాగుతోంది. గత ప్రభుత్వంలో నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ఇదే సమయంలో ప్రజాధనం తిరిగి వసూలు చేసేలా ప్రత్యేక చట్టం చేయాలని ఆ లేఖలో సూచించారు. గనుల లీజులు, ఇసుక తవ్వకాలు, మైనింగ్ వ్యవహారాల్లోనూ ఎవరెవరి పాత్ర ఉందని తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని నియమించింది. రాయలసీమకు చెందిన ముఖ్య నేతలు గనుల లీజుల్లో అవినీతికి పాల్పడ్డారని ప్రభుత్వం వద్ద పక్కా సమాచారం ఉన్నట్లు చెబుతున్నారు. రెడ్ బుక్ పేరుతో బెదిరింపులు కాకుండా.. నేరుగా ప్రజాస్వామ్య బద్ధంగా వైసీపీ నేతల అక్రమాలను ప్రజల ముందు పెట్టి.. తర్వాత కేసులు పెట్టి .. మట్టి తన చేతికి అంటకుండా టీడీపీ అసలు ప్లాన్ అమలు చేస్తోందని నెల రోజుల పరిణామాలను బట్టి అర్థం చేసుకోవచ్చని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

# 3 ఎకరాల్లో పవన్ ఇల్లు

## పిఠాపురంలో సొంతంగా ఇల్లు నిర్మించేందుకు సన్నాహాలు

### ఇప్పటికే స్థలం కొనుగోలు
### ఎకరం 15లక్షల నుంచి 16 లక్షలు ఉంటుందని చర్చ
### మరో 10 ఎకరాలు కొనేందుకు జనసేన సిద్ధం
### వైసీపీ నేతల విమర్శలను తిప్పికొట్టేందుకు ఇంటి నిర్మాణం
### పిఠాపురం ప్రజల హామీలు అమలు చేస్తానని పవన్ ప్రమాణం

**కాకినాడ, జూలై 5 (ప్రజాస్వరం) :**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో సొంతంగా ఇల్లు కట్టేందుకు సన్నాహాలు ప్రారంభించారు. స్థానికంగా స్థలం కూడా కొనుగోలు చేశారు. బుధవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది.పిఠాపురం మండలంలోని భోగాపురం, ఇల్లింద్రాడ రెవిన్యూ పరిధిలో 1.44 ఎకరాలు, మరో బిట్ లో 2.08 ఎకరాలు తీసుకున్నారు. ఆ భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ పూర్తయింది. పవన్ పేరిట కొనుగోలు చేశారు.పవన్ పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ప్రకటించినప్పుడు నాన్ లోకల్ గా ముద్ర వేసేందుకు ప్రయత్నించిన సంగతి తెలిసిందే. అప్పట్లో వైసీపీ నేతలు పవన్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఎక్కడో సినిమాలు చేసుకునే పవన్ ను గెలిపిస్తారా? స్థానికంగా ఉండే వంగా గీతను గెలిపిస్తారా? అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కానీ పిఠాపురం నియోజకవర్గ ప్రజలు మాత్రం ఆ ప్రచారాన్ని నమ్మలేదు. పవన్ ను తమ మనిషిగా భావించి ఆదరించారు. ఎన్నికల్లో ఓటు వేశారు. 70 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించారు. పవన్ సైతం కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం తో పాటు నాలుగు కీలక మంత్రిత్వ శాఖలను సొంతం చేసుకున్నారు. పదవి బాధ్యతలు చేపట్టిన తొలిసారి పిఠాపురం నియోజకవర్గంలో అడుగుపెట్టిన పవన్ మూడు రోజులపాటు క్షణం తీరిక లేకుండా గడిపారు.అందులో భాగంగానేఇంటి స్థలాన్ని కొనుగోలు చేసి.. నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండడం విశేషం.పవన్ కొనుగోలు చేసిన ప్రాంతంలో ఎకరం స్థలం మార్కెట్ విలువ 15 లక్షల నుంచి 16 లక్షలు ఉంటుందని చర్చ జరుగుతోంది. అయితే దీనితోపాటు జనసేన నేతలు మరో 10 ఎకరాల తోటలు కొనేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. రెండు ఎకరాల స్థలంలో క్యాంప్ ఆఫీస్, మిగిలిన స్థలంలో ఇల్లు కట్టుకోవాలని పవన్ భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు పిఠాపురంలో పర్యటిస్తున్న పవన్ తన ఇంటి నిర్మాణం పై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను పిఠాపురంలో ఉండనని.. హైదరాబాదులో ఉంటానని వైసీపీ నేతలు విమర్శించారని.. కానీ పిఠాపురంలో మూడున్నర ఎకరాలు కొని ఈరోజే రిజిస్ట్రేషన్ చేయించినట్లు పవన్ ప్రకటించడం విశేషం. నియోజకవర్గ ప్రజలు పిఠాపురం ఎమ్మెల్యే తాలుకానేనని.. కానీ తనకు చెడ్డ పేరు తీసుకురావద్దని కోరారు పవన్ కళ్యాణ్. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని పవన్ ప్రమాణం చేయడం విశేషం.



## ఆర్థిక అవసరాల కోసం

# 8,274 వేల ఎకరాలు

### అమరావతిపై చంద్రబాబు ప్రత్యేక ఫోకస్

**విజయవాడ, జూలై 5 (ప్రజాస్వరం) :**
ఏపీ సీఎం చంద్రబాబు అమరావతిని ప్రాధాన్యత ప్రాజెక్టుగా తీసుకున్నారు. అధికారంలోకి రాగానే రాజధానిపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. రాజధాని ప్రాంతంలో పర్యటించారు. తాజాగా శ్వేత పత్రం సైతం విడుదల చేశారు. ఇప్పటివరకు రాజధానిలో చేపట్టిన నిర్మాణాలు, ఖర్చులు, వాటి స్థితిగతుల గురించి వివరించారు. ఎన్ని కష్టాలు వచ్చినా అమరావతిపై బలంగా ముందుకు వెళ్తామని సంకేతాలు ఇచ్చారు. అదే సమయంలో ఆర్థిక అవసరాల కోసం అమరావతిలో కేటాయించిన భూముల వివరాలను సైతం స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుక్షణం అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి. విద్యుత్ వెలుగులు వచ్చాయి. అమరావతికి దగ్గరగానే చంద్రబాబు ఈ రాష్ట్రానికి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతి రాజధాని శరవేగంగా నిర్మాణం జరుపుకుంటుందని సంకేతాలు ఇచ్చారు. ఇప్పుడు అందుకు తగ్గట్టుగా కార్యాచరణ ప్రారంభించారు.2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు సీఎం అయ్యారు. అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా ప్రకటించారు. దాదాపు 53,748 ఎకరాల భూమిని రైతుల నుంచి సమీకరించారు. అయితే ఇలా సేకరించిన భూమిలో 8,274 ఎకరాలను ఆర్థిక అవసరాల కోసం వినియోగించనున్నట్లు ప్రభుత్వం శ్వేత పత్రంలో పేర్కొంది. పూలింగ్ సమయంలో ఇక్కడ భూమి నుంచి వచ్చే ఆదాయం ద్వారా రాజధాని నిర్మించుకోవచ్చు ని 2019కి ముందే చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధానికి సేకరించిన భూముల్లో కనీసం 8 వేల ఎకరాలు మిగులుగా ఉంటుందని నాడు పేర్కొన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన శ్వేత పత్రంలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. మొత్తం సేకరించిన భూమిలో రోడ్లు ఇతర సదుపాయాల కోసం 27,885 ఎకరాలు, రైతులకు ప్లాట్లు తిరిగి ఇచ్చేందుకు 11826 ఎకరాలు, ఇతర అవసరాల కోసం 14,037 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. అయితే ఇతర అవసరాలు ఏమిటనేది శ్వేత పత్రంలో ప్రస్తావించలేదు.అయితే పక్కా ప్రణాళికలో భాగంగానే అమరావతిలో మిగులు భూమిని 8274 ఎకరాలను ఉంచినట్లు తెలుస్తోంది. నిధుల రూపంలో మార్చుకునేందుకు ఈ భూమిని అందుబాటులో ఉంచనున్నట్లు తెలుస్తోంది.టిడిపి ప్రభుత్వం అమరావతిని రాజధానిగా గుర్తించింది.ప్రపంచ నగరాల్లో ఒక అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దాలని భావించింది.అప్పట్లో అమరావతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. కానీ గత ఐదు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో అమరావతి ర్యాంకింగ్ గణనీయంగా పడిపోయింది. దీంతో ఈ మిగులు భూమి విషయంలో ఎలా ఉపయోగించుకుంటారన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది. ర్యాంకింగ్ లేకపోతే పెట్టుబడి సమస్యలు ముందుకు రావు. బ్యాంకులు రుణాలు ఇవ్వవు కూడా. అందుకే చంద్రబాబు ఈ మిగులు భూముల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. గతంలో సింగపూర్ సంస్థలు ముందుకు వచ్చాయి. ఇప్పుడు ఇతర దేశాల సంస్థలకు సైతం ఆహ్వానాలు పంపారు. అవి ఎంతవరకు మొగ్గ చూపాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

# అమెజాన్ కోసం రానా షో

ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి తెలుగులో సినిమా చేసి చాలా కాలం అయింది. 2022 లో పవన్ కళ్యాణ్ తో చేసిన 'భీమ్లా నాయక్' తరువాత వచ్చిన 'విరాట పర్వం' విడుదలైన తరువాత, రానా తెలుగు సినిమా చెయ్యలేదు. సుమారు రెండు సంవత్సరాలకి పైగా అయింది, రానా తెలుగు సినిమా వొప్పుకొని. అయితే ఇప్పుడు రానా దగ్గుబాటి తమిళ సినిమా చేస్తున్నారు. రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న 'వెట్టి యాన్' లో రానా విలన్ గా నటిస్తున్నాడు. దీనికి 'జై భీం' ఫేమ్ టిజె జ్ఞానవేల్ దర్శకుడు. ఈ సినిమా చిత్రీ కరణ ఇంకా కొంచెం మిగిలి వుంది అని తెలిసింది. ఇదిలా ఉండగా రానా దగ్గుబాటి ఈమధ్య చాలా చిన్న సినిమాలని ప్రోత్సహిస్తున్నాడు. ఇంతకు ముందు 'పరేషాన్' అనే సినిమాని ప్రోత్సహించినట్టు గానే ఇప్పుడు '35' అనే సినిమాకి రానా ముందుండి నడిపిస్తున్నాడు. అలాగే మలయాళం సూపర్ స్టార్ దుల్కర్ సల్మాన్ తో ఒక సినిమా నిర్మిస్తున్నాడు రానా. ఈ సంవత్సరం ఈ సినిమా చిత్రీకరణ మొదలవుతుందని తెలుస్తోంది. ఇవి కాకుండా రానా దగ్గుబాటి అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం ఒక షో చేస్తు న్నట్టుగా తెలిసింది. ఈ షో కి 'ది రానా కనెక్షన్' అని పిలుస్తు న్నారు. ఇందులో రానా దగ్గుబాటి దక్షిణాదికి చెందిన అగ్ర నటులను ఒక దగ్గరకి చేర్చి వారితో సంభాషించనున్నట్టుగా తెలుస్తోంది. అయితే ఇంతకు ముందు నటులతో చాలా షో లు వచ్చినా, రానా ఇది తన మార్కు వుండేటట్టుగా ఒక అద్భుతమైన కాన్సెప్ట్ తో వెళుతున్నట్టుగా తెలిసింది. ఈ షో కోసమని రామానాయుడు స్టూడియో లో ఒక సెట్ కూడా తయారవు తోంది అని వినికిడి. అలాగే కొన్ని తెలుగు సినిమాలు కూడా ఈ సంవత్సరం ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇవన్నీ కాకుండా 'రానా నాయుడు' వెబ్ సిరీస్ రెండో సీజన్ చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో తన చిన్నాన్న వెంకటేష్ తో నటిస్తున్న సంగతి తెలిసిందే. మొదటి సీజన్ అద్భుత మైన విజయం సాధించింది.






# ఎన్ఆర్‌కె 21 టైటిల్‌తో.. కళ్యాణ్ రామ్ తాజా చిత్రం


నందమూరి కళ్యాణ్ రామ్ తాజాగా నటిస్తున్న కొత్త చిత్రం ఎన్ఆర్‌కె 21.. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్నాడు. ఎన్టీఆర్ ఆర్ట్స్, అశోక క్రియేషన్స్ అశోక్ వర్ధన్ ముప్పా , సునీల్ బలుసు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ పరిసరాల్లో శరవేగంగా జరుగుతోంది. అయితే ఈ రోజు కళ్యాణ్ రామ్ జన్మదినం సందర్భంగా మేకర్స్ సినిమా నుంచి ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసి కళ్యాణ్ రామ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆ పోస్టర్‌లో చుట్టూ మనుషులు అగ్నికి అహుతై ఉండగా చేతిలో నిప్పుతో కళ్యాణ్ రామ్ ఉన్న లుక్‌ను విడుదల చేసారు. మీరు ఆదర్శంగా ఉండలేకపోతే భయపెట్టే వాడిలా ఉండండి' అంటూ డైలాగ్స్ ట్యాగ్ చేశారు. చిత్రంలో సాయి మంజ్రేక్ హీరోయిన్‌గా నటిస్తుండగా, లేడీ సూపర్ స్టార్ విజయ శాంతి ఓ కీలక పాత్ర పోషిస్తుంది. వీరితో పాటు బాలీవుడ్ నటుడు సోహైల్ ఖాన్, శ్రీకాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తు న్నారు. ఈ ఏడాది చివరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు.

# ప్లీజ్.. నాకెవరైనా.. హెల్ప్ చేయగలరా?

మోహన్ బాబు వారసురాలిగా సినీపరిశ్రమలో ఎంట్రీ ఇచ్చిన మంచు లక్ష్మి ఆ తరువాత తనకంటూ పత్ర్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. నటిగా, టీవీ షో హోస్ట్‌గా, నిర్మాతగా విజయాన్ని అందుకుంది. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మంచులక్ష్మి ట్రోలర్ల విషయంలో దూకుడుగా ఉంటుంది. వాళ్ల తీరును ఎండగట్టేందుకు అసలేమాత్రం సంకోచించదు. అయితే, తాజాగా ప్రజల సాయం అర్థిస్తూ మంచు లక్ష్మి పెట్టిన పోస్టు నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. "నిరాశలో సహాయం కోసం వెయిట్ చేస్తున్నా. నా వీసా కోసం నెల క్రితం అప్లై చేశాను. కానీ ఇప్పటికీ నాకు అది రాలేదు. నా కుమార్తె పాఠశాల సెలవులు ముగుస్తున్నాయి. జులై 12న నా ఫ్లైట్ ఉంది. ఎంబసీ వెబ్‌సైట్ డౌన్ కావడంతో, వారిని సంప్రదించడానికి నాకు మార్గం లేకుండా పోయింది. ఇప్పటికే రెండు నెలలు దాటింది. దయచేసి ఎవరైనా సహాయం చేయగలరా?" అంటూ మంచు లక్ష్మి తన సమస్యను నెట్టింట పంచుకుంది. మంచు లక్ష్మి పోస్టుకు జనాలు పెద్ద ఎత్తున స్పందించారు. తమకు తెలిసిన వారి ఫోన్ నెంబర్లు షేర్ చేశారు. సెలబ్రిటీ అయ్యుండీ సామాన్యుల్ని సహాయం అడగడంపై మరికొందరు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.






## వినూత్న కథాంశంతో.. సరిపోదా శనివారం మూవీ

'సరిపోదా శనివారం'తో సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వివేక్ ఆత్రేయ తెరకెక్కిస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుల్ మోహన్ కథానాయిక. ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. నాని ఇందులో సూర్య అనే పాత్రలో కనిపించనున్న సంగతి తెలిసిందే. ఆ పాత్రకు సంబంధించిన రెండో లుక్‌ను గురువారం విడుదల చేశారు. శనివారాల్లో యాక్షన్ కోణంలో హింసాత్మకంగా కనిపించే సూర్య.. మిగిలిన రోజుల్లో ఎలా ఉంటాడన్నది ఈ ప్రచార చిత్రంతో చూపించారు. నాని ఆ పోస్టర్‌లో పక్కింటి కుర్రాడి తరహాలో బైక్‌పై చిరునవ్వులు చిందిస్తూ రావడం కనిపించింది. 'వినూత్నమైన కథాంశంతో రూపొందుతోన్న యాక్షన్ చిత్రమిది. దీంట్లో నాని పాత్ర రెండు కోణాల్లో కనిపిస్తుంది. ప్రస్తుతం చిత్రీకరణ ముగింపు దశలో ఉంది' అని చిత్రవర్గాలు తెలిపాయి. ఇది ఆగస్టు 29న థియేటర్లలోకి రానుంది. సంగీతం: జేక్స్ బిజోయ్, ఛాయాగ్రహణం: జి.మురళి.

# భారతీయుడు2 రన్‌టైమ్ 3.04 గంటలు

## సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్

ప్రముఖ నటుడు కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భారతీయుడు 2'సినిమా 'భారతీయుడు'కు సీక్వెల్‌గా వస్తోంది. తాజాగా ఈ యాక్షన్ థ్రిల్లర్ సెన్సార్ పూర్తి చేసుకుంది. కొన్ని సూచనలు ఇస్తూ సెన్సార్ బోర్డు దీనికి యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. 'భారతీయుడు 2' రన్‌టైమ్ ఏకంగా 3.04 గంటలు ఉంది. కొన్ని సన్నివేశాల్లో ఉపయోగించిన పదాలను మ్యూట్ చేయాలని సెన్సార్ బోర్డ్ చిత్రబృందాన్ని సూచించింది. ఇంత నిడివి ఉన్న చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోవాలంటే అందుకు తగిన కథ, కథనాలు ఉండాలి. అయితే శంకర్ ఈ విషయంలో పూర్తి విశ్వాసంతో ఉన్నారు. దీని గురించి ఆయన మాట్లాడుతూ అన్ని సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయన్నారు. జులై 12న ఈ సినిమా విడుదల కానుంది. ఇటీవల వచ్చిన 'యానిమల్', 'సలార్', 'కల్కి 2898 ఏడీ' చిత్రాలు మూడు గంటలకు పైగా రన్‌టైమ్‌తో విడుదలయ్యాయి. ఇప్పుడు వీటి జాబితాలో కమల్ హాసన్ 'భారతీయుడు 2' చేరింది. ఆ సినిమాలన్నీ విజయం సాధించి కలెక్షన్ల వర్షం కురిపించాయి. ఇప్పటికే 'భారతీయుడు 2'పై భారీ అంచనాలున్న నేపథ్యంలో ఈ చిత్రం కూడా మంచి వసూళ్లు సాధించడం ఖాయమని సినీప్రియులు అభిప్రాయ పడుతున్నారు. 'భారతీయుడు' 1996లో శంకర్ దర్శకత్వంలో వచ్చి సంచలనం సృష్టించింది. సేనాపతి పాత్రలో కమల్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' మరోసారి మ్యాజిక్ చేసేందుకు సిద్ధమైంది. అవినీతిపై ఉద్యమం చేసే లక్ష్యంతో చిత్ర కథ నడవనుంది.



# మట్టి దొంగలు !

## రాత్రి పగలు తేడాలేకుండా

- టిప్పర్లతో యథేచ్ఛగా అక్రమ వ్యాపారం
- మూడు పూవ్వులు ఆరు కాయలుగా దందా
- అధికారులు చర్యలు తీసుకుంటున్నా పట్టించుకోని వ్యాపారులు
- కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు



**మెదక్, మనోహరబాద్ జులై 5 (ప్రజాస్వరం) :** మట్టి దొంగలు బరితెగిస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా ప్రతీ రోజు వందలాది టిప్పర్ల ద్వారా మట్టిని అక్రమంగా తరలించుకుపోత ున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటున్నా వ్యాపారులు మాత్రం వాటిని పట్టించుకాకుండా యథేచ్ఛగా పని కానిచేస్తున్నారు. మట్టి అక్రమ రావాణాకు మనోహరాబాద్ మండలం అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భూములు అనే తేడా లేకుండా జోరుగా రాత్రి వేళల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతం కావడంతో కొత్త కొత్త పరిశ్రమలు నిర్మాణంలో ఉండటంతో మట్టి అవసరం తప్పనిసరిగా మారింది. దీంతో వ్యాపారులు అదే అదునుగా భావించి అక్రమ వ్యాపారాన్ని ఎంచుకొని జోరుగా దందా సాగిస్తున్నారు. అదేంటని ప్రశ్నిస్తే వారిని తగిన విధంగా అనుకూలంగా మలుపుకొని వ్యాపారాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. అక్రమ వ్యాపారాన్ని అడ్డుకునేందుకు, మట్టి దొంగలను అదుపు చేసేందుకు యంత్రాంగం విఫలమవుతున్నదననే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోపక్క ఎవరికైనా అడ్డొస్తే వారిపై దాడులు జరిగిన సంఘటనలు కూడా వున్నాయి. ఫిర్యాదు చేయాలని అనుకున్న వారు భయభ్రాంతులకు గురవుతూ అక్రమ వ్యాపారాన్ని అడ్డుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకున్న సంఘటనలు చాలా ఉన్నాయి. లోతైన గుంతలుగా తొవ్వుతూ భూములను ప్రమాదకరంగా మారుస్తున్నా అధికారుల్లో చలనం రాకపోవడంలో ఆంతర్యమేంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### అక్రమార్కులకు అడ్డుకట్ట ఏదీ..?

**అక్రమ వ్యాపారాన్ని అడ్డుకునేందుకు జిల్లా అధికారులు గతంలోనే సంబంధిత శాఖల అధికారులతో కూడిన విజిలెన్స్ కమిటీ పేరుతో ఓ కమిటీ వేశారు. కానీ ఆ కమిటీ ఏర్పాటైన ఇప్పటి వరకు అక్రమ వ్యాపారాన్ని అడ్డుకున్న సందర్భం ఏమీ కనిపించలేదు. సంబంధిత శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండడంతోనే ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారో అర్థంకావడం లేదని ప్రజలు అనుకుంటున్నారు. మట్టి తవ్వకాలను, రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన సిబ్బంది సైతం భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అధికారుల దృష్టికి వచ్చినా గట్టి చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే అలసత్వం వహిస్తుండడంతో వ్యాపారం చేసుకునే వారికి అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకొని మట్టి అక్రమ రవాణా అడ్డుకుంటారా లేక తమకేమీ పట్టనట్లుగా ఉంటారా చూడాల్సిందే.**

### పగలూ రాత్రి తేడాలేకుండా..

**మనోహరాబాద్ మండలంలో అక్రమార్కులు పగలూ రాత్రి తేడాలేకుండా మట్టిని తరల ిస్తున్నారు. అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న వారిని అదుపు చేసేందుకు జిల్లాస్థాయిలో అధికారులు అన్ని విధాల ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా పూర్తిస్థాయిలో అదుపు చేయలేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంతకు ముందు రాత్రి వేళల్లో మాత్రమే మట్టి వ్యాపారం జోరుగా సాగేది. కానీ కొన్ని రోజులుగా మధ్యాహ్నం సమయంలో కూడా మట్టి టిప్పర్లు నడుస్తుండడంతో అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు అప్పుడప్పుడు టిప్పర్లను సీజ్ చేసి జరిమానాలు విధిస్తున్నా వ్యాపారాన్ని పూర్తిస్థాయిలో ఎందుకు నిలుపుదల చేయడం లేదో అర్థం కానీ పరిస్థితి నెలకొంది.**





## ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు

మెదక్, జూలై 05 (ప్రజాస్వరం) : రోడ్లపై ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లను నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ఎస్పీ బాలస్వామి హెచ్చరించారు. కేజ్ వీల్స్ తో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు డ్యామేజ్ అవుతాయని అన్నారు. ప్రభుత్వం ఎంతో వ్యయంతో ప్రజలకు సుఖవంతమైన ప్రయాణం కోసం రోడ్లను ఏర్పాటు చేసిందని అన్నారు. కొందరు ట్రాక్టర్ యజమానులు పొలాల్లో పని చేయడానికి కేజ్ వీల్స్‌ను రోడ్ల పై ఉపయోగించడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని అన్నారు. ట్రాక్టర్ యజమానులు పొలాల్లో పనుల నిమిత్తం వెళ్ళేటప్పుడు తమ ట్రాక్టర్ల ను కేజ్ వీల్స్ తో రోడ్డుపై నడపవద్దని సూచించారు. అలా వీల్స్ తో రోడ్ల పైకి వచ్చే ట్రాక్టర్ యజమానులపై మోటారు వాహన చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ట్రాక్టర్ యజమానులు గమనించాలని సూచించారు.



## క్రీడల వల్ల మానసిక ఉల్లాసం

### ఆర్టీసీ మహిళా కండక్టర్లకు క్రీడా పోటీలు

మెదక్, జూలై 05 (ప్రజాస్వరం) : క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని మెదక్ డిపో మేనేజర్ సుధా తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో మహిళ కండక్టర్ల కు క్రీడా పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ఆర్టీసీ డిఎం సుధ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా బాలకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

తూప్రాన్, జూలై 5 (ప్రజాస్వరం) : తూఫ్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టుబాల కృష్ణారెడ్డి వందేళ్లు చల్లగా ఉండాలని, మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజాసేవ చేయాలని దేవుని ప్రార్థించినట్లు సర్పంచ్ల ఫోరం మండల మాజీ అధ్యక్షులు భగవాన్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దీపక్ రెడ్డి తెలిపారు. కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు తూప్రాన్ సహకార సొసైటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు భగవాన్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దీపక్ రెడ్డి ప్రముఖులు శాలువాతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేశారు. సహకార సొసైటీ బ్యాంక్ మేనేజర్ సెక్రెటరీ దినేష్, డైరెక్టర్లు జావేద్ శ్రీనివాస్ రెడ్డి, బుడ్డ భాగ్యరాజ్, వెంకటేష్ యాదవ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తూఫ్రాన్ చెరువు కట్ట వద్ద గల దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జావేద్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేవైఎం నాయకుల అరెస్టు

**మెదక్, జూలై 05 (ప్రజాస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తి స్థాయిలో విఫలమైందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ తెలిపారు. చలో కలెక్టరేట్ నేపథ్యంలో పోలీసులు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ తో పాటు బీజేపీ నాయకులు మరికొందరిని ముందస్తు అరెస్ట్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం చలో కలెక్టరేట్ ముట్టడికి వస్తున్న బీజేవైఎం నాయకులను అడ్డుకుని బలవంతంగా స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని, అన్ని నోటిఫికేషన్లు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించాలని అన్నారు. 25 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ ప్రకటించి, ప్రస్తుత నోటిఫికేషన్ పరీక్ష తేదీలను మార్చాలన్నారు. గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షల నోటిఫికేషన్లు అదనంగా పోస్టులను పెంచి గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో 1: 100 క్వాలిఫై చేయాలన్నారు.





## సింగరేణి ప్రైవేటీకరణ కేంద్రం ఆలోచన సరికాదు

- బొగ్గు బ్లాక్ ను సింగరేణికే కేటాయించాలి
- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నరసమ్మ
- అదనపు కలెక్టర్ కి వినతి పత్రం అందజేత

**మెదక్, జూలై 05 (ప్రజాస్వరం) :** సింగరేణికే నేరుగా బొగ్గు బ్లాక్ లను కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం బొగ్గు బావుల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కు మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే నరసమ్మ మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తల పెట్టిన శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ ను నేరుగా సింగరేణికే కేటాయించాలన్నారు. సింగరేణి సంస్థ బ్రిటిష్ కాలంలోనే హైదరాబాద్ రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థగా ఉందని అన్నారు. సింగరేణి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ప్రతి సంవత్సరం సుమారు 8 వేల కోట్ల రూపాయలు చెల్లిస్తూందన్నారు. బిజెపి పాలించిన పది సంవత్సరాలలో 49 వేల కోట్లకు పైగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించిందని అన్నారు. ఇలాంటి సంస్థను కేంద్ర ప్రభుత్వం ప్రవేటీకరణ చేయాలని చూస్తున్నదని అన్నారు. మైన్స్ మినరల్ యాక్ట్ లోని సెక్షన్ 17 ఏ ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు బొగ్గు బ్లాక్ ను కేటాయించాలని అన్నారు. కానీ కేంద్రంలోని ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి సంస్థను కూడా వేలంలో పాల్గొనాలని చెబుతుందన్నారు. సింగరేణికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని వేలాన్ని వెంటనే ఆపాలన్నారు లేకపోతే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యద ర్శి వర్గ సభ్యులు బరిగే బస్వరాజు, కొరింకల మల్లేశం జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, నాయకులు లచ్చ గౌడ్, శౌకత్, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పది ఎకరాల్లోపు రైతులకే రైతు భరోసా ఇవ్వాలి

**తూప్రాన్ జూలై 5 ( ప్రజాస్వరం) :** 10 ఎకరాలలోపు పంట పండించే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని రైతులు కోరారని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా పై అభిప్రాయాలు సేకరించడానికి రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు తూప్రాన్ ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో భూమి ఉన్న వారందరికీ సాగుతో సంబంధం లేకుండా ఇచ్చారని దీనివల్ల ధనవంతులకే భూమి పండించిన వారికే డబ్బులు వస్తున్నాయని చెబుతూ పంట పండించే రైతులకు మాత్రమే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.
దీనిపై రైతుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రైతులు మాట్లాడుతూ పది ఎకరాల లోపు పంట పండించే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని ఏ గ్రామంలో అతను రైతు పంట పండిస్తాడో ఆ గ్రామానికి ఇది వర్తించాలని ఇతర వేరు వేరు ప్రాంతాలలో భూములు ఉన్నవారికి ఇవ్వవద్దని కోరారు. ఆధార్ కార్డు లింక్ ఉన్న భూములకు మాత్రమే ఇవ్వాలని కోరారు. రెండు మూడు గ్రామాలలో అంతకుమించి గ్రామాలలో భూములు ఉన్నవారికి ఒక గ్రామంలోని ఆధార్ లింకు ద్వారా ఇవ్వాలని సూచించారు. రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను కలెక్టర్ కు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొక్కొండ దీపక్ రెడ్డి, డైరెక్టర్లు గొల్లపల్లి సంతోష్ రెడ్డి, పట్లురి చంద్రశేకర్ రెడ్డి, దరవత గోపి, బొల్లంపల్లి సరిత బాబుల్ రెడ్డి , భూమన్నగారి యాదగౌడ్, మన్నే ముత్యాలు, పెద్దింటి వెంకటమ్మ, వంగల వెంకట్ రెడ్డి, యం.డి.జావిద్ పాషా, గుర్రని సత్యనారాయణ, అక్కంగారి శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి గంగుమల్ సహాయ వ్యవసాయ అధికారులు సంతోష్, సింధూ, పీఏసీఎస్ సీఈవో దినేష రైతులు పాల్గొన్నారు.



ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక



## జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్

**వికారాబాద్, జూలై 5 (ప్రజాస్వరం):** జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పదవీకాల పరిమితి గురువారంతో పూర్తి అయినందున శుక్రవారం జెడ్పీ సీఈఓ ఛాంబర్ లో కలెక్టర్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి సుధీర్ కలెక్టర్ ను సాదరంగా ఆహ్వానించారు.



**నేడు సదరం క్యాంపునకు స్లాట్ బుకింగ్**

వికారాబాద్ జిల్లా వికలాంగులకు సదరం క్యాంపునకు సంబంధించి జూలై 6 శనివారం ఉదయం 11 గంటలకు స్లాట్స్ ఉంటుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12, 23, 24, 30, 31 తేదీల్లో తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న అంగ వైకల్యం, బుద్ధి మాంధ్యత, చెవుడు, మూగ దరఖాస్తుదారులు హాజరుకావాలని అన్నారు. 09, 16, 19, 25న వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో నిర్వహించే క్యాంపునకు అంగ వైకల్యం, అంధులు హాజరుకావాలన్నారు. సదరం సర్టిఫికెట్ ఇది వరకు పొంది కాల పరిమితి అయిపోయిన వారితోపాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్నవారు హాజరుకావాలన్నారు. మొత్తం 650 స్లాట్స్ అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.




## హామీలను వెంటనే నెరవేర్చాలి

- మెగా డీఎస్సీ ప్రకటించాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించిన నిరుద్యోగులు

**వికారాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :** బీజేవైఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా వికారాబాద్ నియోజకవర్గ బీజేపీ పార్టీ కోఆర్డినేటర్ వడ్ల నందు, జిల్లా అధ్యక్షులు చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. కలెక్టర్ కి మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ... భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిరుద్యోగుల సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి బీజేపీ పరిగి మండల అధ్యక్షులు సతీష్ ముదిరాజ్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి పోతుల బుగ్గప్ప, యువ నాయకుడు ప్రభాకర్ గౌడ్, నరేశ్‌ని ముందస్తుగా అరెస్టు చేసి పీఎస్ కు తరలించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీని విస్మరించి వారి జీవితాలతో ఏడు నెలలుగా ఆడుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మెగా డీఎస్సీ ని వేయాలి, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వివేకానంద రెడ్డి, రొంపల్లి ఎంపిటిసి శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ బుచ్చిరెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్, సాయి, వెంకట్, నరేందర్ రెడ్డి, అశోక్, వెంకట్ యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలి



- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలి
- గిరిజన సంక్షేమ సెక్రటరీ డాక్టర్ శరత్

**వికారాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :** గురుకుల ఆశ్రమ, గిరిజన హాస్టళల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మంచి భోజనం అందించాలని గిరిజన సంక్షేమ సెక్రటరీ డాక్టర్ ఎ. శరత్ అన్నారు. శుక్రవారం కలెక్టరెట్ కాన్ఫరెన్స్ హాలు నందు గురుకుల, గిరిజన హాస్టల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పరీక్షలు రాసి లిస్ట్లో పేర్లున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి అడ్మిషన్స్ ఇవ్వాలని, వేకెన్సీ లేకుండా చూడాలని అన్నారు. పాత టెండర్ల ను పిలిచి ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలన్నారు. జిల్లా లో క్లస్టర్ వారిగా వంట వారిని గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. భోజనం సరిగా లేకపోతే పిల్లల ఆరోగ్యం పాడవుతుందని, పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలని అన్నారు. హాస్టళ్లలో ఎక్కడైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలని, విద్యార్థులకు డ్రెస్ లు కుట్టించి అనుకున్న టైం లోపల పంపిణీ చేయాలని ఆదేశించారు. బదిలీల జీఓ వచ్చినందున జిల్లా స్థాయిలో అధికారులు సమావేశం ఏర్పాటు చేసుకొని ఆప్షన్ తీసుకొని పోస్టింగ్ ప్రిపేర్ చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను తొలగిస్తామని, అవసరమైన సౌకర్యాలని కల్పిస్తామని, తద్వారా వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. తాగునీటిపై ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని, హాస్టళ్ళు, కేజీబీవీ పాఠశాలలకు నాణ్యమైన బియ్యం వచ్చేలా చూస్తామని అన్నారు. తాగునీరు, శానిటేషన్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో ఇంచార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ చందన, ఎస్సీ వెల్ఫేర్ హేమలత, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి మల్లేశం, గిరిజన సంక్షేమ హాస్టల్ వార్డెన్లు, గురుకుల ప్రిన్సిపాళ్లు, ఆర్ సి ఓ తదితరులు ఉన్నారు.



## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- మెడికల్ కళాశాల, రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులపై సమీక్ష

**వికారాబాద్, జూలై 5 (ప్రజాస్వరం):** జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జిల్లాలోని వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ లోని స్టేట్ చాంబర్‌లో వికారాబాద్ పట్టణంలో రైల్వే ప్లైఓవర్ బ్రిడ్జి, వికారాబాద్ ఏరియా ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణాల పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రదీప్ జైన్ తో కలిసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆసుపత్రి, కళాశాలకు అవసరమైన సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా త్వరలో ప్రారంభించనున్న ఆసుపత్రికి మౌలిక సదుపాయాలతోపాటు నీటి సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వికారాబాద్ పట్టణంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులపై ఆర్ అండ్ బి అధికారులను ఏ దశలో పనులు ఉన్నాయని విషయాన్ని తెలుసుకున్నారు. అధికారులకు అభివృద్ధి పనుల అమలులో ఏవైనా సమస్యలు ఉంటే తనకు తెలపాలని స్పీకర్ సూచించారు. సమీక్షలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, ఆర్ అండ్ బి ఈ ఈ లాల్ సింగ్, మిషన్ భగీరథ ఈ ఈ బాబు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఆర్ అండ్ బి డీఈ, ఈఈలు ఉన్నారు.

**విద్యార్థులను పరామర్శించిన స్పీకర్**

వికారాబాద్ జిల్లాలోని అనంతగిరిపల్లిలోని తెలంగాణ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో అనారోగ్యానికి గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. హాస్టల్లోని భోజనశాల, వంటగది, డార్మెంటరీ రూమ్‌లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ హాస్పిటల్ లో ఉన్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, అలాగే హాస్టల్ లో ఉన్న చిన్న చిన్న మరమ్మతులను వెంటనే చేయిస్తామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి స్పీకర్ తో పాటు జిల్లా కలెక్టర్, తదితరులు భోజనం చేశారు.




### అన్ని పార్టీలు అంతే ..!

ఒకసారి పార్టీ సిద్ధాంతాలు నచ్చి, అందులో ప్రాథమిక కార్యకర్తగా ప్రవేశించి, వివిధ దశల్లో నమ్మకంగా పనిచేసిన కార్యకర్తలకే వారి శక్తి, సామర్థ్యాల మేరకు గతంలో పార్టీలు అవకాశాలు కల్పించేవి. ఈ సంస్కృతి మన దేశంలో మొదట వామపక్షాల్లో, ఆ తర్వాత జనసంఘ్/ బీజేపీలో కనిపించాయి. వారే పార్టీ జెండాలు మోసేవారు, పార్టీ సిద్ధాంతాలను బలంగా నమ్మేవారు. ఏండ్ల తరబడి ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా పార్టీ కోసం అహర్నిశలూ పని చేసేవారు. పార్టీ కోసం ప్రాణత్యాగాలకు సైతం వెనుకాడేవారు కాదు. కొన్నిసార్లు వివిధ అంతర్గత, బాహ్య కారణాల వల్ల పదవులు వచ్చినా, రాకున్నా పార్టీని, దాని సిద్ధాంతాన్ని మనసా వాచా బలంగా నమ్మి, గాఢంగా విశ్వసించి పనిచేసేవారు. ఇప్పుడు కాలం మారింది. అలాంటి పార్టీలు, అలాం టి నాయకులు కరువయ్యారు. మారుతున్న పరిస్థితుల కారణంగా రాజీపడి బీజేపీ, వామపక్ష పార్టీలు కూడా క్రమశిక్షణకు తిలోదకాలిచ్చాయి. ఇవే కాదు, అన్ని పార్టీలు ఈ దుష్ట సంస్కృతికి గేట్లు తెరిచాయి.

# అధికారమే పరమావధి !

- రాష్ట్రంలో జోరందుకున్న ఫిరాయింపుల రాజకీయం..
- పార్టీ సిద్ధాంతాలను పాతర వేస్తున్న కొందరు నేతలు
- స్వలాభం కోసం, పదవుల కోసం పక్కదారులు..
- అధికారం కోల్పోతే ఉండలేకపోతున్న వైనం
- పారా హుషార్ అంటూ అధికార పార్టీలకి పరుగులు
- క్రమశిక్షణకు తిలోదకాలిస్తున్న పార్టీలు..
- అసహ్యించుకుంటున్న ప్రజలు

**మేడ్చల్, జులై 5 (ప్రజాస్వరం) :** ప్రస్తుతం రాష్ట్రంలో ఫిరాయింపుల రాజకీయం జోరుగా సాగుతోంది. కొందరు నేతలు తమ స్వలాభం కోసం, పదవుల కోసం, అధికారాన్ని అనుభవించడం కోసం రాజకీయాల ను భ్రష్టు పట్టిస్తున్నారనే వాదన వినిపిస్తోంది. పార్టీ సిద్ధాంతాలను పాతర పెట్టి అధికారం ఎక్కడ ఉంటే అక్కడికి క్యూకడుతున్నారు. అన్నితరాల రాజకీయ నేతలకు ఫిరాయింపులు ఫ్యాషన్‌గా మారాయి.

అనుభవించీ.. అనుభవించీ.. అధికారం చేజారేసరికి కొందరు సీనియర్ నాయకులు ఉండలేక పోతున్నారు. అందుకే అధికారం వెంటే పారా హుషార్ అంటూ పరుగులు తీస్తున్నారు. పది సంవత్సరాల పాటు అధికారం అనుభవించిన వారు నేడు అధికారం లేకపోవడంతో పక్క పార్టీల్లోకి మారుతున్నారు. కొందరు పెద్ద నేతలను మాత్రమే పక్క పార్టీ వారు కోరుకొని పార్టీలో చేర్చుకుంటుండగా మరికొంత మంది నేతలు మేము కూడా వచ్చి మీ పార్టీలోనే చేరుతామని వెళ్లి మరీ పార్టీ కండువాలు కప్పుకుంటున్నారు. ప్రజా ఓట్లతో గెలిచిన ప్రజా ప్రతినిధులు ప్రజల సేవలను పట్టించుకోకుండా వారి అభిప్రాయలను లెక్క చేయకుండా వారి ఇష్టారీతిన పార్టీ ఫిరాయిస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరిగి పోతుంది. ఇలానే జరిగితే ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి వలస వెళ్లి అధికార పార్టీ కండువాలు వేసుకునే పరిస్థితి కొనసాగుతుంది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇష్టారీతిన సంపాదనకు అలవాటు పడిన కొందరు నాయకులు వారి అక్రమాలు కొనసాగించుకునేందుకు పార్టీలు మారుతుండగా, అక్రమంగా సంపాదించిన ఆస్తులను కాపాడుకోవడానికి మరికొందరు పార్టీ ఫిరాయింపులు చేస్తున్నారు. ప్రజా సేవే లక్ష్యం .. అధికారం.. అనధికారం.. ఐ డోంట్ కేర్.. అనే నాయకులు మాత్రం వారి వారి పార్టీలోనే కొనసాగుతున్నారు. తమను ఎన్నుకున్న ప్రజలకు సేవ చేసేందుకు, తమ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకే, పార్టీలు మారుతున్నామనే సాకులు చెప్తున్నారని, కానీ నాయకులు వారి స్వ ప్రయోజనాల కోసమే పార్టీలు మారుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### వారికున్న ఓపిక వీరికి లేకపాయే ..

కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో రెండు దఫాలు అధికారంలో వుంది. మొదటి సారి స్వరాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన అప్పటి టీఆర్ఎస్ పార్టీనీ ఎదుర్కొని కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ పార్టీల నాయకులు వారి వారి పార్టీలోనే కొనసాగారు. కొన్ని కొన్ని కారణాల వాళ్ళ టీడీపీ కోలుకోలేని పరిస్థితికి చేరుకోవడంతో వారు చాలా వరకు పార్టీ మారారు. కానీ, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు మాత్రం ఆయా పార్టీలోనే కొనసాగారు. వారిలో కొంత మంది అధికార దాహం కోరుకున్న వారు కొందరు మాత్రమే పార్టీ మారినా, చాలా మంది నాయకులు మాత్రం సొంత పార్టీలోనే కొనసాగారు. 10 సంవత్సరాలపాటు అధికార బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీని ఎదుర్కొని ప్రతిపక్ష పార్టీలో కొనసాగిన కాంగ్రెస్, బీజేపీ నాయకులకు వున్నా ఓపిక కూడా 10 నెలలపాటు కుడా బీఆర్ఎస్ నాయకులకు లేకపోవడంపై ప్రజల్లో తీవ్రంగా చర్చ జరుగుతుంది. ప్రజల మేలు కోరే నాయకులు ప్రజల్లో వుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఎప్పటికప్పుడు స్పందించాలింది పోయి స్వలాభాల కోసం పార్టీ కండువాలు మారుస్తూ, ప్రజా సేవలను పట్టించుకునే వారు లేకుండాపోయారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## జిల్లా ప్రజలకు సునీత కృతజ్ఞతలు



**వికారాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :** వికారాబాద్ జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డి జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారంతో జిల్లా పరిషత్ మండల పరిషత్ల పదవీకాలం పూర్తవడంతో ఆమె జెడ్పీ చైర్ పర్సన్ పదవి బాధ్యతలు నుండి తప్పుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్పర్సన్ గా ఆ తర్వాత వరుసగా రెండుసార్లు వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్పర్సన్ సునీత మహేందర్ రెడ్డి ఎన్నికవుతూ వచ్చారు. ఈ సందర్భంగా సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రజలు తన పట్ల చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల సహకారంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో వికారాబాద్ జిల్లా పరిధిలో ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. పదవి ఉన్న లేకున్నా ప్రజాసేవకు తాను పునరంకితమవుతానని ఈ సందర్భంగా వెల్లడించారు.

## అరెస్టులు అప్రజాస్వామికం

**వికారాబాద్, జూలై 5 (ప్రజాస్వరం):** విద్యార్థుల శాంతియుత నిరసనపై ప్రభుత్వం నియంతృత్వంతో వ్యవహరించిందని బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయరావు అన్నారు. అరెస్టు చేసిన విద్యార్థి సంఘాల నాయకులను నిరుద్యోగులను యువకులను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు భారత రాష్ట్ర సమితి అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. బీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముట్టడిలో భాగంగా తాండూర్ టౌన్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్టు అయినవారిలో బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు, తాండూర్ టౌన్ ప్రెసిడెంట్ సందీప్ రెడ్డి, రాజక నర్సింలు, బీజేవైఎం శ్రీకాంత్ రెడ్డి, అశోక్, శివ, తదితర విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నారు.

## రూ. 125 కోట్లతో ఆధునీకరణ..

- వికారాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రతిపాదనలు
- కోటపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి రూ. 110 కోట్లు ..
- జుంటుపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి రూ. 15 కోట్లు..
- ప్రాజెక్టును పరిశీలించిన నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు

**వికారాబాద్, జూలై 5 (ప్రజాస్వరం) :** వికారాబాద్ జిల్లాలో కోటపల్లి మధ్యతరహా ప్రాజెక్టు ఆధునీకరణ పనులకు రూ. 110 కోట్లు, యాలాల మండలం జుంటుపల్లి ప్రాజెక్టు ఆధునికరణకు రూ. 15 కోట్ల నిధులు మొత్తం 124 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ధర్మతెలిపారు. యాలాల మండలంలోని జుంటుపల్లి వద్ద ఉన్న సాగునీటి ప్రాజెక్టును నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ధర్మ, ఏసీ రంగారెడ్డి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు యాలాల మండలం జుంటుపల్లి ప్రాజెక్టుకు ఉన్న కుడి, ఎడమ రెండు కాలువలను, అలాగే రెండు తూముల ప్రస్తుత తాజా పరిస్థితులను వారు రైతులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంజినీర్ ఇన్ చీఫ్ సీఈ ధర్మ మాట్లాడుతూ ... కోటిపల్లి జుంటుపల్లి రెండు ప్రాజెక్టుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే టెండర్లు ఖరారు చేసి పనులు చేపడతామని తెలిపారు. కోటపల్లి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఆధునికరిస్తే 9200 ఎకరాల ఆయకట్టుకు, అలాగే జుట్టుపల్లి ప్రాజెక్టును అభివృద్ధి చేస్తే 2080 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వారం రోజుల వ్యవధిలోనే ఈ రెండు ప్రాజెక్టుల ఆధునీకరణ పనులకు టెండర్లు ఖరారు చేస్తామని చీఫ్ ఇంజనీర్ తెలిపారు. ఇప్పటికీ కోటిపల్లి మధ్యతరహా ప్రాజెక్టు ఆధునికరణ పనులకు రూ. 110 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చీఫ్ ఇంజనీర్ ధర్మ తెలిపారు.



సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చొరవ తో జిల్లాలోని కోటపల్లి ,జుంటుపల్లి రెండు సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి మరమ్మతు పనులకు రూ. 125 కోట్ల నిధులు మంజూరుకు త్వరలోనే ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించనున్నట్లు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 50 ఏళ్ల క్రితం నిర్మాణమైన జుంటుపల్లి ప్రాజెక్టు పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. దీంతో కాలువలతో మారాయని అన్నారు. అయితే ప్రభుత్వం చేత నిధులు మంజూరు చేయించి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ ఈ రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా ఈఈ సుందర్, తాండూర్ సబ్ డివిజన్ యాలాల డీఈ కిష్టయ్య, సాగునీటి ప్రాజెక్టుల కాంట్రాక్టర్ కొత్తగాడి మాణిక్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కర్ణం పురుషోత్తం రావు, రవి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

